KR TV

# మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...






Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 01 సంచిక 153 | శనివారం 03-05-2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 | వెల: 3 రూ/-


## భారత్‌లో.. పాక్ ప్రధాని యూట్యూబ్ ఛానల్ నిలిపివేత!



పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాక్ సంబంధాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆ ఘటన తర్వాత భారత ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ యూట్యూబ్ ఛానల్ స్ట్రీమింగ్‌ను మనదేశంలో నిలిపివేసింది. జాతీయ భద్రతకు సంబంధించి భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ కంటెంట్ ప్రస్తుతం ఈ దేశంలో అందుబాటులో లేదని ఆ ఛానల్ క్లిక్ చేసిన వారికి ఒక సందేశం దర్శనమిస్తోంది.

## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే మా లక్ష్యం: డిప్యూటీ సీఎం భట్టి



అభివృద్ధి పథంలో ముందుకు పోతూనే.. యువతకు ఉపాధి చూపే ఉద్యోగాల గనిగా రూపుదిద్దుకోవాలని ఆ దిశగా కార్మికులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. మన ముందు తరాల వారు ఆరోగ్యంగా, ఆర్థికంగా బలమైన సింగరేణి సంస్థను మనకు అందించారని, మనం కూడా మన వారసులకు ఉజ్వల సింగరేణిని అందించకపోతే భావి తరాలకు తీరని నష్టం చేసిన వాళ్లం అవుతామని హెచ్చరించారు. సింగరేణి అభివృద్ధిలో కింది ఉద్యోగి నుంచి సీఎండీ వరకు అందరికీ సమాన బాధ్యత ఉంటుందని, సంస్థ ప్రయోజనాల దృష్ట్యా కఠినమైన నిబంధనలు అమలు చేస్తూ ముందుకెళ్లాలని స్పష్టం చేశారు.

## నేషనల్ హెరాల్డ్ కేసులో

### సోనియా, రాహుల్‌కు కోర్టు షాక్ - నోటీసులు జారీ



నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు తాజాగా నోటీసులు జారీ చేసింది. వారితో పాటు కేసులో ఇతర ప్రతిపాదిత నిందితులకు కూడా కోర్టు నోటీసులు ఇచ్చింది. ఇప్పటికే దాఖలైన చార్జ్‌షీట్‌పై వాదనలు వినేందుకు ఈ నోటీసులు జారీ చేసినట్టు కోర్టు పేర్కొంది.



# అమరావతికి సహకరిస్తాం

- అమరావతి పునర్నిర్మాణ పనులకు మోడీ శంకుస్థాపన
- తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రధాని మోడీ
- ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- అమరావతి ఒక నగరం కాదు, అమరావతి ఒక శక్తి
- చంద్రబాబు టెక్నాలజీ వాడకాన్ని గమనించాను
- రూ.58 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం
- సాగు నీరుకు ఇబ్బంది లేకుండా నదుల అనుసంధానం చేస్తున్నాం..
- రైతులకు ఎలాంటి సమస్య ఉండకూడదనేది మా ప్రభుత్వ లక్ష్యం..
- పోలవరం ప్రాజెక్ట్ త్వరగా పూర్తి అయ్యేందుకు సహకరిస్తాం: ప్రధాని మోడీ



“అమరావతి ఒక నగరం కాదు... అది శక్తి,” అంటూ అభిప్రాయపడ్డారు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ . వికసిత్ భారత్‌కు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఇంజిన్‌గా మారాలని ఆకాంక్షించారు. అమరావతిలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు.

తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించిన మోడీ , “దుర్గాభవానీ కొలువైన పుణ్యభూమిలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది,” అన్నారు. మధ్య మధ్యలో తెలుగులో సంభాషిస్తూ ప్రజలను ఆకట్టుకున్నారు.

చంద్రబాబుకు ప్రత్యేక ప్రశంసలు

“పెద్ద ప్రాజెక్టులను చేపట్టి వేగంగా పూర్తి చేయడంలో చంద్రబాబుకు సాటి లేరు,” అని ప్రధాని ప్రశంసించారు. “2015లో అమరావతి శంకుస్థాపనలో పాల్గొన్నాను. కేంద్రం గత పదేళ్లుగా అమరావతికి సంపూర్ణ మద్దతు ఇచ్చింది. మౌలిక వసతుల అభివృద్ధికి అన్ని విధాలుగా తోడ్పడుతోంది,” అని తెలిపారు.

## పాలనా వైఫల్యం ప్రజలకు శాపం..



### కాంగ్రెస్ నిర్లక్షంపై హరీశ్ రావు మండిపాటు

తెలంగాణలో పాలనాపరంగా కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్ మండలం రత్నాపూర్ గ్రామంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీలో చేరిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా పాలిస్తోందని, పాలనలో తీవ్ర వైఫల్యాలు ప్రజలకు శాపంగా మారాయని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కూడా తెలంగాణను పూర్తిగా విస్మరించిందని, రాష్ట్రానికి అన్యాయం తప్ప మరేమీ చేయలేదని ధ్వజమెత్తారు.


## హీటెక్కుతున్న కులగణన రాజకీయాలు ..

### గవర్నర్‌ను కలిసిన తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతలు



దేశంలో కులగణన రాజకీయాలు వేడెక్కుతున్న నేపథ్యంలో, తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతలు గురువారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపడంతో పాటు, దానిని రాష్ట్రపతికి పంపినందుకు ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్‌కు మా సంపూర్ణ మద్దతు : అమెరికా



- భారత్‌కు అమెరికా ఫుల్ సపోర్ట్
- ఉగ్రవాద వ్యతిరేక పోరాటంపై స్పందన
- ఉద్రిక్తతలను నిశితంగా గమనిస్తున్నాం
- ప్రధాని మోదీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నాం
- ఉగ్రవాదులను ఏరివేయడంలో పాక్ సహకరించాలి
- మీడియాతో అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి టామీ బ్రూస్
- ఉగ్రవాదుల వేటకు పాక్ సహకరించాలన్న ఉపాధ్యక్షుడు వాన్స్


## అమరావతి ప్రజల సెంటిమెంట్..

### మూడేళ్లలో రాజధాని పూర్తి చేస్తా: సీఎం చంద్రబాబు



- మోదీజీ.. ఉగ్రవాదంపై పోరులో మీకు అండగా ఉంటాం
- కులగణనపై మోదీ నిర్ణయం గొప్పది
- వెంటిలేటర్ పైనుంచి బయటకు వచ్చాం..
- ఉద్యమకారులకు నా సెల్యూట్ -సీఎం చంద్రబాబు నాయుడు

## దివిసీమ తుపానులా అమరావతిని వైకాపా తుడిచేసింది: పవన్



అమరావతి రైతులు గత ఐదేళ్లుగా నలిగిపోయి.. లాఠీ దెబ్బలు తిన్నారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అమరావతి పునఃనిర్మాణం సభలో ఆయన ప్రసంగించారు. గతంలో రైతులను కలిసినప్పుడు ‘మా కన్నీళ్లు తుడిచేదెవరు’ అని అడిగినట్లు గుర్తు చేసుకున్నారు. అమరావతి ఐదు కోట్ల మందికి సంబంధించిన హబ్ అని అభివర్ణించారు. దేశమే తన కుటుంబంగా మోదీ భావిస్తున్నారని కొనియాడారు.

## నేటి మాట

మీరు మీ భవిష్యత్తును మార్చలేరు. కానీ,
మీ అలవాట్లను మార్చుకోగలరు.
కాబట్టి.. మీ అలవాట్లు..
మీ భవిష్యత్తును మారుస్తాయి.



\- అబ్దుల్ కలాం

## కృష్ణా నదీజలాల్లో తెలంగాణ న్యాయమైన వాటా కోసం పోరాడాలి : మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటా కోసం రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా పోరాడాలని అన్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాము 92 శాతం పనులు పూర్తిచేసిన పాలమూరు ప్రాజెక్టును మరో రెండేళ్లలో పూర్తి చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం విస్మయం కలిగించేదిగా ఉందన్నారు.

## అధికారులపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సీరియస్



- ఉప్పల్ నుంచి ఘట్‌కేసర్ వైపు నిర్మిస్తున్న ఫ్లైఓవర్
- ఫ్లైఓవర్ నిర్మాణానికి భూ సేకరణ ప్రక్రియలో జాప్యం
- ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలన్న మంత్రి
- భూసేకరణ జాప్యం అంశంపై అధికారులపై కేంద్ర మంత్రి సీరియస్

## కుల గణనపై తెలంగాణ బీజేపీ నేతలకు నిద్ర పట్టడం లేదు..



- ఇంటి ఇంటికి అధికారులు వెళ్లి సర్వే చేశారు
- చర్చలో బీజేపీ, సీపీఐ, బీఆర్ఎస్ పాల్గొన్నాయి
- కిషన్ రెడ్డికి ఈ విషయం తెలుసుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి వ్యాఖ్యలు

మన క్రాంతి KR TV ఇది వాస్తవ పత్రిక...



## అమరావతికి సహకరిస్తాం.. ఏపీ కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలు: మోడీ

మొదటి పేజీ తరువాయి

పవన్ కల్యాణ్‌తో కలిసి కలలు నిజం చేస్తాం

"ఎన్టీఆర్ కలలు కనిన వికసిత ఆంధ్రప్రదేశ్‌ను అందరం కలిసి నిర్మించాలి. పవన్ కల్యాణ్ గారూ, ఇది మనమే చేయాలి. అమరావతి ఐటీ, ఏఐ, విద్య, వైద్యం, పరిశ్రమల కేంద్రంగా మారుతుంది. హరిత శక్తి ఆధారిత అభివృద్ధి దీని లక్ష్యం," అని మోడీ అన్నారు.

రైలు, రోడ్డు కనెక్టివిటీకి కొత్త శకం

రాష్ట్రంలో కనెక్టివిటీని విస్తృత పరచేందుకు రూ. 60,000 కోట్ల విలువైన రైలు, రోడ్డు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగినట్లు తెలిపారు. "ఒకప్పుడు తెలుగు రాష్ట్రాలకు రూ.900 కోట్లే కేటాయించేవాళ్లు. ఇప్పుడు ఏపీకి మాత్రమే రూ.9,000 కోట్లు ఇచ్చాం. వందేభారత్, అమృత్ భారత్ రైళ్లు, 750 పైగా రైల్వే బ్రిడ్జలు, అండర్‌పాస్‌లు నిర్మించాం. 70 పైగా స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నాం," అన్నారు.

పోలవరం పనులు వేగవంతం

"ప్రతి ఎకరాకు నీరు అందించే దిశగా పోలవరం ప్రాజెక్టును త్వరగా పూర్తిచేస్తాం. రైతులకు రూ.17 వేల కోట్ల మేర సాయం అందించాం. మౌలిక వసతుల పెంపుతో స్టీల్, సిమెంట్, రవాణా రంగాలు అభివృద్ధి చెందుతాయి. వేలాది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి," అని వివరించారు.

ఆంధ్రప్రదేశ్‌ను ఆధునిక రాష్ట్రంగా మార్చే శక్తి %-% అమరావతి

"అమరావతి పేరే శుభ సంకేతం. ఇది యువత కలలు సాకారమయ్యే రాజధాని. ఐక్యతే భారత శక్తి. శ్రీహరికోట, నాగాయలంక, విశాఖలో అభివృద్ధి పనులు దేశ గౌరవాన్ని పెంచుతున్నాయి. జూన్ 21న విశాఖలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి హాజరవుతాను," అని ప్రధాని తెలిపారు.

మూడేళ్లలో అమరావతి పూర్తి – జీడీపీ పెరుగుదలపై నమ్మకం

"మూడేళ్లలో అమరావతి పనులు పూర్తి చేస్తామని సీఎం చెబుతున్నారు. ఆ పనులు పూర్తయ్యాక ఏపీ జీడీపీ స్థాయిని ఊహించగలుగుతున్నా. ఇది రాష్ట్ర చరిత్రలో మలుపు తీసుకురానుంది. అభివృద్ధిలో మీ భుజంతో నా భుజం కలిపి పనిచేస్తాను," అని మోడీ హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. "ఇదంతా కేవలం కాంక్రీటు నిర్మాణాలు కాదు... ఇవి ఏపీ ఆశలకి పునాదులు," అని ప్రధాని భావోద్వేగంగా పేర్కొన్నారు.

## హీటెక్కుతున్న కులగణన రాజకీయాలు ..

మొదటి పేజీ తరువాయి

రాజ్‌భవన్ చేరుకున్న బీసీ నేతల బృందానికి మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వం వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, కేంద్రం జనాభా లెక్కలతో పాటు కులగణన నిర్వహించనున్నట్టు తీసుకున్న నిర్ణయాన్ని బలహీన వర్గాలు హర్షంగా స్వాగతిస్తున్నాయని తెలిపారు.

"తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన దేశానికి రోల్ మోడల్‌గా నిలిచింది. గతంలో కులగణనను విమర్శించినవారే ఇప్పుడు దానిని ఆదర్శంగా తీసుకుంటున్నారు" అని పొన్నం వ్యాఖ్యానించారు. ఇది రాహుల్ గాంధీ చేపట్టిన సమానత్వ ఉద్యమానికి ఫలితమని, ఆయన నినాదం ఇప్పుడు ఆచరణ రూపంలో కనిపిస్తోందని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వం తెలంగాణ మాదిరిగా కులగణన చేపట్టే దిశగా ముందుకెళ్తుండడాన్ని బీజేపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని, అలాంటి విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కులగణన ఒక సామాజిక న్యాయ సాధనంగా నిలవాలని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.

## కుల గణనపై తెలంగాణ బీజేపీ నేతలకు నిద్ర పట్టడం లేదు..

కుల గణనపై తెలంగాణ బీజేపీ నేతలకు నిద్ర పట్టడం లేదని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. అసెంబ్లీలో జరిగిన చర్చలో బీజేపీ, సీపీఐ, బీఆర్ఎస్ కూడా పాల్గొన్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయికి సర్వే వెళ్ళిందని.. కిషన్ రెడ్డికి ఈ విషయం తెలుసుకోవాలన్నారు. ఇంటి ఇంటికి అధికారులు వెళ్లి సర్వే చేశారన్నారు. కుల గణనపై కిషన్ రెడ్డి చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు. రేవంత్ సక్సెస్ అయ్యాడు కాబట్టి డైవర్ట్ చేసి బురద జల్లే ప్రయత్నం చేయకండన్నారు. 100 శాతం సర్వే సక్సెస్ ఫుల్ గా జరిగిందని.. గవర్నర్ కూడా ఆమోదముద్ర వేశారన్నారు. అంటే సర్వే సరిగా జరిగింది అనే కదా..? అని అడిగారు. సర్వే జరిగిన నెల రోజుకు కిషన్ రెడ్డి తెలంగాణలో లేర అనుకుంటా అన్నారు.

అందుకే ఆయనకు కుల గణన మీద పూర్తిస్థాయిలో అవగాహన లేదని జగ్గారెడ్డి అన్నారు. అసెంబ్లీలో మీ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారని.. వాళ్ళు కూడా మద్దతు ఇచ్చినట్లు తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యేల మీద కూడా అనుమానం ఉందా..? అని ప్రశ్నించారు. సర్వేలో పాల్గొనని వాళ్ళ కోసం మళ్ళీ సమయం పొడిగించారు కదా..? అన్నారు. కిషన్ రెడ్డి మాటలు నమ్మకండని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కిషన్ రెడ్డికి సెంట్రల్ పార్టీ మొట్టికాయలు వేసిందని.. అందుకే ఈ మధ్య స్టేట్మెంట్లు ఇస్తున్నారన్నారు. కేంద్రం నిర్ణయం తీసుకునే సమయంలో ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పారు. రాజకీయ విమర్శలు మానుకోండన్నారు.

## అధికారులపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సీరియస్

ఉప్పల్ నుంచి ఘట్ కేసర్ వైపు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించిన భూ సేకరణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అధికారులను ఆరా తీశారు. ప్రజల ప్రయాణ సౌలభ్యం కోసం ప్రాధాన్యతతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉప్పల్-ఘట్ కేసర్ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం భూమి సేకరణలో ఆలస్యం పట్ల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సీరియస్ అయ్యారు. లక్షలాది ప్రయాణికుల రాకపోకలకు ఉపయోగపడే ఉప్పల్ నుంచి ఘట్ కేసర్ వైపు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ కోసం భూమి సేకరణ ప్రక్రియలో జాప్యం అవుతున్న విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అధికారులను ప్రశ్నించారు. ప్రాజెక్టు వేగవంతంగా పూర్తయ్యేలా వెంటనే భూమి సేకరణ పూర్తిచేయాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సుమారు రూ. 400 కోట్ల వ్యయంతో నిర్మితమైన అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను మే 5న కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఫ్లైఓవర్ కింద రోడ్డుపై ప్రజలకు అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆదేశించారు.

కాగా.. మరోవైపు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధిలో మొదట ప్రతిబింబించేది హైదరాబాద్ అని.. అభివృద్ధి అంటే కేవలం హైటెక్ సిటీ కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. ఓల్డ్ సిటీ, గౌలిగూడ, అంబర్ పేట్, సనత్ నగర్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాలూ కీలకమని తెలిపారు. నిధుల కొరత లేకుండా చూసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రింకింగ్ వాటర్, డ్రైనేజీ వంటి సమస్యలు బస్తీల్లో రొటీన్ అయ్యాయన్నారు.

నగరంలో అవసరమైన ప్రతిచోట స్ట్రీట్ లైట్స్, రీస్టోరేషన్ తక్షణ చర్యలు అవసరమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైటెక్ సిటీతో పాటు ఓల్డ్ సిటీ అభివృద్ధిపై సమాన దృష్టితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మెట్రో రైలు ప్రాజెక్టులో అఫ్జల్‌గంజ్ వరకే పరిమితమైన ఫస్ట్ ఫేజ్‌ను విస్తరించాలన్నారు. సెకండ్, థర్డ్, ఫోర్త్ ఫేజ్‌ల కోసం ప్రతిపాదనలు వెంటనే కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం పంపించాలన్నారు.

## దివిసీమ తుపానులా అమరావతిని వైకాపా తుడిచేసింది: పవన్

మొదటి పేజీ తరువాయి

అమరావతి పునఃప్రారంభానికి విచ్చేసిన ఆయనకు చేతులెత్తి నమస్కరిస్తున్నట్లు చెప్పారు. "దివిసీమ తుపానులా గత ప్రభుత్వం అమరావతిని తుడిచేసింది. ధర్మయుద్ధంలో అమరావతి రైతులే విజయం సాధించారు. రాజధాని రైతుల పోరాటానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. అమరావతి రైతుల త్యాగాలను మరిచిపోలేం. వారి త్యాగాలకు జవాబుదారీగా ఉంటాం. రాజధాని నిర్మించి అమరావతి రైతుల రుణం తీర్చుకుంటాం. రైతులు భూములు ఇవ్వడం మాత్రమే కాదు.. రాష్ట్రానికి భవిష్యత్‌నిచ్చారు. అమరావతి ప్రపంచ స్థాయి సర్వశ్రేష్ఠ రాజధానిగా ఆవిర్భవిస్తుంది. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వాలు ఉండటం వల్ల శరవేగంగా అభివృద్ధి జరుగుతుంది. భవిష్యత్తులో మన విద్యార్థులు బెంగళూరు, హైదరాబాద్ వలస వెళ్లరు. అందరం కోరుకున్నట్లే చంద్రబాబు సీఎం అయ్యారు. ఆయన పాలనా దక్షతతో అమరావతిని అద్భుత రాజధానిగా తీర్చిదిద్దుతాం. అమరావతి రాష్ట్రానికే కాదు.. దేశానికే తలమానికంగా నిలుస్తుంది. అమరావతికి సహకరిస్తున్న మోదీకి ధన్యవాదాలు. భవానీ మాత మోదీని మరింత శక్తిమంతున్ని చేయాలి"అని పవన్ ఆకాంక్షించారు.

## అమరావతి ప్రజల సెంటిమెంట్.. మూడేళ్లలో రాజధాని పూర్తి చేస్తా: సీఎం చంద్రబాబు

అమరావతి రాజధాని పునర్నిర్మాణానికి శంకుస్థాపన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. "ఉగ్రదాడులపై మోడీ ఆవేదనతో ఉన్నారు, దేశ భద్రత కోసం తీసుకునే ప్రతి నిర్ణయానికి మేము అండగా ఉంటాం," అని చెప్పారు.

"రూ.57,980 కోట్ల ప్రాజెక్టులకు ఇవాళ శంకుస్థాపన జరిగింది. మూడేళ్లలో అమరావతిని పూర్తి చేసి మళ్లీ మోడీని ఆహ్వానిస్తాం," అని చంద్రబాబు తెలిపారు. అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా, హెల్త్-ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. బిట్స్ పిలానీ, టాటా ఇన్నోవేషన్ హబ్ వంటి సంస్థలు రానున్నాయని చెప్పారు.

34 వేల ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా ఇచ్చిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. వారి పోరాటం అమరావతికి ప్రాణవాయువు అని కొనియాడారు. కేంద్రం తీసుకున్న కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తూ, కేంద్ర సహకారంతో ఏపీ అభివృద్ధి దిశగా సాగుతుందని పేర్కొన్నారు.

## కేసీఆర్ చేసిన పెద్ద మిస్టేక్ అదే.. మంత్రి పొంగులేటి హాట్ కామెంట్స్

పదేళ్ల బీఆర్ఎస్ పాలన, మాజీ సీఎం కేసీఆర్ పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. శుక్రవారం మీడియా ప్రతినిధులతో పొంగులేటి చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందదర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ వ్యవస్థ ను తన దగ్గర పెట్టుకొని కేసీఆర్ సర్వనాశనం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో మంత్రులకు పవర్ లేదు.. స్వేచ్ఛగా రివ్యూ చేసుకునే పరిస్థితి ఉండేది కాదని గుర్తుచేశారు. పదేళ్ల పాటు ఒక్క మంత్రిని కూడా సరిగా పనిచేయనీయలేదని అన్నారు. భూభారతి వల్ల 70 శాతం ప్రజలకు ఉపయోగం జరిగినా తాము సక్సెస్ అయినట్లే అని చెప్పారు. భూభారతి లో కొత్త సాఫ్ట్వేర్ రాబోతోందని కీలక ప్రకటన చేశారు. ఇందిరమ్మ ఇండ్లలో అవినీతి జరగదు.. జరగనివ్వను అని హామీ ఇచ్చారు. త్వరలోనే రాష్ట్రంలో సర్వేయర్ల నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. జూన్‌లో సర్వే మ్యాప్ పైలెట్ ప్రాజెక్టు ద్వారా రిజిస్ట్రేషన్‌లు చేస్తామని వెల్లడించారు. 6 వేలు దరఖాస్తులు సర్వేకు వచ్చాయి.. భర్తీ చేయబోతున్నామని అన్నారు. ప్రైవేట్ సర్వేయర్లతో భూముల సర్వే జరుగుతుంది ప్రభుత్వ పర్యవేక్షణ సైతం ఉంటుందని చెప్పారు.

## నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌కు కోర్టు షాక్ - నోటీసులు జారీ

నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు తాజాగా నోటీసులు జారీ చేసింది. వారితో పాటు కేసులో ఇతర ప్రతిపాదిత నిందితులకు కూడా కోర్టు నోటీసులు ఇచ్చింది. ఇప్పటికే దాఖలైన చార్జ్‌షీట్‌పై వాదనలు వినేందుకు ఈ నోటీసులు జారీ చేసినట్టు కోర్టు పేర్కొంది.

కోర్టు తెలిపిన వివరాల ప్రకారం, చార్జ్‌షీట్‌లో ఉన్న లోపాలను ఇప్పటికే సరి చేసినట్టు తెలిపింది. అయితే ప్రస్తుతం ముఖ్యంగా భారతీయ నగరిక సురక్షా సంహిత సెక్షన్ 223 ప్రకారం నోటీసులు జారీ చేయవచ్చా అనే అంశాన్ని పరిశీలించాల్సి ఉందని న్యాయమూర్తి తెలిపారు. తదుపరి విచారణను కోర్టు మే 8, 2025కి వాయిదా వేసింది.

ఈ దశలో నిందితులకు వాదనలు వినిపించే హక్కు ఉందని, ఇది %దీచీూ% సెక్షన్ 223 ప్రకారం వారికి ఉన్న న్యాయ హక్కుగా పేర్కొంది. ఈ హక్కు మనీలాండరింగ్ నిరోధక చట్టానికి వ్యతిరేకంగా కాదని కూడా కోర్టు అభిప్రాయపడింది. న్యాయ విచారణ కొనసాగించేందుకు ఇది కీలకమని న్యాయమూర్తి పేర్కొన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తరపున వాదనలు వినిపించిన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ప్రకారం, నోటీసుల జారీకి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, న్యాయ ప్రక్రియను మద్దతు చేస్తున్నామని వెల్లడించారు.

ఈడీ దాఖలు చేసిన చార్జ్‌షీట్ ప్రకారం, సోనియా, రాహుల్ కలిసి అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ ) ఆస్తులను అక్రమంగా స్వాధీనం చేసుకోవడానికి క్రిమినల్ కుట్ర చేశారని ఆరోపించారు. రూ. 2,000 కోట్ల విలువైన ఆస్తులను కేవలం రూ. 50 లక్షలతో యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థలోకి బదిలీ చేశారని పేర్కొన్నారు. ఈ సంస్థను సోనియా, రాహుల్ నిర్వహిస్తున్నారని తెలిపారు.

ఈ కేసులో సామ్ పిత్రోడా, సుమన్ దుబే లాంటి ఇతర కాంగ్రెస్ నేతల పేర్లను కూడా ఆరోపణలతో చేర్చినట్టు ఈడీ పేర్కొంది.

## కృష్ణా నదీజలాల్లో తెలంగాణ న్యాయమైన వాటా కోసం పోరాడాలి : మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరిపై విమర్శలు

రేవంత్ రెడ్డి పాలమూరు బిడ్డనంటూ గర్వపడుతుంటే, అదే ప్రాజెక్టుపై నిష్క్రియత చూపడం దారుణమని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఉద్దండపూర్ మినహా మిగిలిన అన్ని పంప్ హౌస్‌లు, టన్నెళ్లు, రిజర్వాయర్లు పూర్తయ్యాయని గుర్తు చేశారు. ప్రాజెక్టు భూసేకరణలో 27 వేల ఎకరాలకు గాను 100 ఎకరాల వరకు మినహా పూర్తయ్యిందని తెలిపారు.

అవసరమైన ప్రాజెక్ట్‌కు రూ.80 కోట్లు, అవాంఛిత మార్గానికి రూ.1800 కోట్లు!

నల్లగొండ, పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు కోసం వట్టెం రిజర్వాయర్ ద్వారా గ్రావిటీ ద్వారా నీళ్లు పంపితే రూ.80 కోట్లలోనే పని పూర్తవుతుందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఖరీదైన మార్గాన్ని ఎంచుకొని ఏదుల నుంచి నీళ్లను పంపేందుకు రూ.1800 కోట్లు ఖర్చుచేయనుందని విమర్శించారు. ఇందులో ఇప్పటికే రూ.1300 కోట్ల టెండర్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. సరసమైన మార్గాన్ని పక్కన పెట్టి అధిక ఖర్చుతో పని చేయడం దారుణమని, దీనిపై నిపుణుల కమిటీ వేయాలని డిమాండ్ చేశారు.

ట్రిబ్యునల్ తీర్పుపై ఆందోళన

కృష్ణా నదీజలాల పునః పంపిణీపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తుది తీర్పును ఈ నెల 7న కేంద్రం ప్రకటించనున్న నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర హక్కుల కోసం గట్టిగా నిలవాలని కోరారు. తెలంగాణ భాగస్వామ్యాన్ని యధాతథంగా అంగీకరిస్తే, భవిష్యత్తులో ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచి 160 టీఎంసీలు నిలిపేసే అవకాశముందని, దీని వల్ల జూరాల ప్రాజెక్టు పూర్తిగా వట్టిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ప్రాజెక్టులపై సమగ్ర సమీక్ష అవసరం

కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ పాలనపై కక్షతోనే పాలమూరు పనుల్లో ఆలస్యం చేస్తోందని, ప్రాజెక్టులపై సమగ్ర సమీక్ష జరిపి ప్రజల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత అధికార పార్టీదేనని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు.

## పాలనా వైఫల్యం ప్రజలకు శాపం.. కాంగ్రెస్ నిర్లక్షంపై హరీశ్ రావు మండిపాటు

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన బసవేశ్వర సంగమేశ్వర ప్రాజెక్టును ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సంగారెడ్డి జిల్లా సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. తాగునీరు, సాగునీటి సమస్యలు భగ్గుమంటున్నాయని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో నీటి లభ్యత ఉండగా, ఇప్పుడు ప్రజలు తాగునీటికోసం ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు.

జహీరాబాద్ నియోజకవర్గానికి కాంగ్రెస్ అన్యాయం చేసిందని, ప్రాంత అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, రాష్ట్ర అభివృద్ధికి బీఆర్ఎస్‌నే ప్రత్యామ్నాయమని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీకి చెందిన పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. హరీశ్‌రావు వారి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో మాజీ ఎంపీటీసీ దేశీటి పటేల్, రవి కుమార్, మాజీ సర్పంచ్ తుకారాం, భాస్కరం, సంగశీటి, సంజీవ్, అమృత్ లు ఉన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఇతర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్‌కు మా సంపూర్ణ మద్దతు : అమెరికా

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని అగ్రరాజ్యం అమెరికా మరోసారి స్పష్టం చేసింది. ఈ విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలిపింది. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ బ్రూస్ వెల్లడించారు. రెండు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను అమెరికా నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపారు.శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో టామీ బ్రూస్ మాట్లాడుతూ.. భారత విదేశాంగ మంత్రి జైశంకర్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రుబియో జరిపిన సంభాషణను ప్రస్తావించారు. 'భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను మేము నిశితంగా గమనిస్తున్నాము. నిన్న మా విదేశాంగ కార్యదర్శి మార్కో రుబియో.. భారత విదేశాంగ మంత్రి జైశంకర్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో మాట్లాడారు. అధ్యక్షుడు ట్రంప్ గత వారం ప్రధాని మోదీతో మాట్లాడుతూ తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ పక్షాన నిలుస్తామని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి మా పూర్తి మద్దతు ఉంటుంది' అని ఆమె అన్నారు.అదేవిధంగా ఇరుదేశాల ప్రభుత్వాలతో తాము టచ్‌లో ఉన్నట్లు తెలిపారు. భారత్-పాక్‌లు బాధ్యతాయుతంగా సుదీర్ఘ శాంతి కోసం అవసరమైన పరిష్కారంపై పనిచేసేలా తమ కార్యదర్శి ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. అదే దక్షిణాసియాలో శాంతి నెలకొల్పుతుందని పేర్కొన్నారు. రెండు దేశాల ప్రభుత్వాలతో బహుళ స్థాయిల్లో చర్చలు కొనసాగిస్తున్నట్లు టామీ బ్రూస్ ఈ సందర్భంగా వెల్లడించారు.

ఉద్రిక్తతలు తగ్గించుకోండి..

అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియో భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో గురువారం ఫోన్‌లో మాట్లాడారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేపట్టే ఎలాంటి చర్యలకైనా తమ సహకారం ఉంటుందని జైశంకర్ కు రుబియో హామీఇచ్చారు. అదే సమయంలో ఉద్రిక్తతలు తగ్గించుకొని, దక్షిణాసియాలో శాంతిభద్రతలు నెలకొల్పేందుకు ఇరు దేశాలు కలిసి పనిచేయాలని కోరారు. ఇక పాక్ ప్రధానితో మాట్లాడిన రుబియో.. పెహల్‌గామ్ ఉగ్రదాడిని ఖండించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ దాడిపై దర్యాప్తునకు పాక్ అధికారులు సహకరించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించుకునేందుకు భారత్‌తో ప్రత్యక్ష చర్చలు జరపాలని సూచించారు.

ఉగ్రవాదులను వేటాడటంలో భారత్‌కు పాక్ సహకరించాలి.. వాన్స్

అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన ఫ్యామిలీతో భారత పర్యటనలో ఉన్న సమయంలోనే పెహల్‌గామ్‌లో ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ దాడి గురించి ఆయన స్పందించారు. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాదులను వేటాడటంలో భారత్‌కు సహకరించాలని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పాకిస్థాన్‌కు సూచించారు. పర్యాటకులపై దాడి దిగ్భ్రాంతికర విషయమన్నారు. ఈ దాడిపై భారత్ ప్రతిస్పందించడం సరైనదేనని వ్యాఖ్యానించారు. అయితే, విస్తృత ప్రాంతీయ సంఘర్షణలకు దారితీయని విధంగా భారత్ స్పందన ఉంటుందని విశ్వసిస్తున్నట్లు చెప్పారు. ఇక పాకిస్థాన్ కూడా ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. పాక్ భూభాగం నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాదులను వేటాడటంలో భారత్‌కు సహకరించాలని సూచించారు.

## భారత్‌లో.. పాక్ ప్రధాని యూట్యూబ్ ఛానల్ నిలిపివేత!

ఈ ఉద్రిక్తతలు భగ్గుమంటోన్న వేళ.. పాకిస్థాన్ కేంద్రంగా నిర్వహిస్తున్న పలు యూట్యూబ్ ఛానళ్ల ప్రసారాలు, సామాజిక మాధ్యమ ఖాతాలను భారత్‌లో నిలిపివేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. పాక్ న్యూస్, ఎంటర్‌టైన్‌మెంట్ మీడియాకు చెందిన పలు ఛానళ్లపై వేటు పడింది. పాక్ మాజీ ఆటగాళ్లు షోయబ్ అక్తర్, బాసిత్ అలీ, షాహిద్ అఫ్రిది ఛానళ్లు కూడా అందులో ఉన్నాయి. ఆ దేశ రక్షణ మంత్రి ఎక్స్ ఖాతాను బ్లాక్ చేసింది.

పాకిస్థాన్ క్రికెటర్స్ బాబర్ అజామ్, మహ్మద్ రిజ్వాన్, షహీన్ అఫ్రిదీ ఇన్‌స్టా ఖాతాలను తాజాగా సస్పెండ్ అయ్యాయి. పాకిస్థాన్ జావెలియన్ త్రోయర్, ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్షద్ నదీమ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను ఇప్పటికే బ్లాక్ చేసిన సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత చట్టపరమైన చర్యల్లో భాగంగా భారత్‌లో అతని ఖాతాను నిలిపివేశారు. "భారత్‌లో నదీమ్ ఖాతా అందుబాటులో లేదు. ఖాతాలోని సమాచారాన్ని నియంత్రించాలన్న చట్టపరమైన అభ్యర్థనను పాటిస్తున్నాం" అని భారత్‌లో నదీమ్ ఇన్‌స్టా ఖాతా తెరిచిన వాళ్లకు ఈ సందేశం కనిపిస్తోంది.

## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే మా లక్ష్యం: డిప్యూటీ సీఎం భట్టి

రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాలకు గరిష్ఠ వయోపరిమితిని 35 నుండి 40 సంవత్సరాలకు పెంచిన కారణంగా, వయోపరిమితి మించిపోయిన వందలాది మంది వారసులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు.హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో భట్టి ముఖ్య అతిథిగా పాల్గొని నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా 21 మంది సింగరేణి వారసులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేయబడ్డాయి.ఈ సందర్భంగా మాట్లాడిన భట్టి విక్రమార్క మాట్లాడుతూ, "నేటి యువతకు ఉపాధి కల్పించే బాధ్యత మనపై ఉంది. మనకెదురైన అవకాశాలను భావితరాలకు అందించడమే నిజమైన అభివృద్ధి," అన్నారు. సింగరేణిని ఆరోగ్యంగా, ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం కార్మికులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు.సింగరేణి పోటీ మార్కెట్లో నిలవాలంటే, ఉత్పత్తి వ్యయాలను తగ్గిస్తూ, పూర్తి పనిగంటలు పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు.

ఇదే సందర్భంలో ఆయన, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "రాజీవ్ యువ వికాసం" పథకం గురించి తెలిపారు. ఈ పథకం కింద రూ.9,000 కోట్ల వ్యయంతో లక్షలాది మందికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు పేర్కొన్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా లబ్ధిదారులకు పత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు.సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి అభివృద్ధికి పూర్తి స్థాయిలో మద్దతు అందిస్తోందన్నారు. వయోపరిమితి సడలింపు ద్వారా అనేక కుటుంబాల్లో వెలుగు నింపినందుకు సీఎం, డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.ఐఎన్టీయూసీ నేత జనక్ ప్రసాద్ మాట్లాడుతూ, సింగరేణి సంస్థలో 40 ఏళ్ల వయోపరిమితి నిర్ణయం దేశంలోనే మొదటిసారి అమలవుతుండటం గర్వకారణమని పేర్కొన్నారు. భట్టి విక్రమార్క నేతృత్వంలో రాబోయే రోజుల్లో మరో ఆరు గనులు ప్రారంభం కానున్నాయని, దీని ద్వారా 20 వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉందని తెలిపారు.ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యలు యువత భవితవ్యాన్ని మెరుగుపరచడంలో కీలకంగా నిలవనున్నాయని స్పష్టం అయింది.వేడి మనోగతంతో, స్పష్టమైన దిశతో, ఉపాధికి ప్రభుత్వం కృషి కొనసాగిస్తోందన్నది ఈ కార్యక్రమం ద్వారా స్పష్టమైంది.

## ఎస్సి ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ రివ్యూ సమావేశంలో పాల్గొన్న -జిల్లా ఎస్సి,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దాసరి తిరుమలేష్



మోత్కూర్ 02మే (క్రాంతి న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్సి,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ హనుమంతరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్మెంట్ ఎస్సి ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ రివ్యూ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని పలు ఎస్సి ఎస్టీ కేసులపై మరియు జిల్లాలోని ఎస్సి ఎస్టీ ఉద్యోగుల పై జరుగుతున్నా కుట్రపూరిట చర్యలు వేధింపుల గురించి చర్చించారు.వివిధ శాఖలల్లో నుండి ఎస్సి,ఎస్టీ ప్రజలకు న్యాయపరంగా జరగాల్సిన పనులు జరిగేలా చూడాలని జిల్లా ఎస్సి,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దాసరి తిరుమలేష్ కోరారు అనంతరం వారు లేవనెత్తిన అంశాలు మాట్లాడే విధానం పై వారికి ఎస్సి,ఎస్టీ ల పక్షాన ఉన్న కమిట్ మెంట్ తో పనిచేస్తున్న విధానం పై అభినందనలు కురిపించి ఈ సందర్భంగా భువనగిరి నియోజకవర్గ శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్ హనుమంతరావు దాసరి తిరుమలేష్ సన్మానించారు.ఈ కార్యక్రమంలో జేసీ వీరారెడ్డి, అడిషనల్ డీసీపీ లక్ష్మినారాయణ, ఆర్డీఓ కృష్ణరెడ్డి, డిఆర్డీఓ నాగిరెడ్డి, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్ రెడ్డి, జిల్లా షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్మెంట్ ఆఫీసర్ వసంత కుమారి, భువనగిరి ఏసీపీ రాహుల్ రెడ్డి, యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్, ఎస్సి కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, %ణఎడవీజ% సభ్యులు లతోపాటు జిల్లా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.




## హక్కుల రక్షణకు,లేబర్ కోడ్స్ రద్దుకు, కార్మికులు ఐక్యంగా ఉద్యమాల్లో పాల్గొనాలి

### 4 లేబర్ కోడ్స్ అమలైతే కార్మికవర్గానికి తీవ్ర నష్టం -గుండు వెంకటనర్సు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి



మోత్కూర్ 02మే (క్రాంతి న్యూస్): నాలుగు లేబర్ కోడ్స్ అమలైతే కార్మిక వర్గానికి తీవ్ర నష్టం జరగడమే కాక, ఉనికి ప్రశ్నర్థకం అవుతుందని, కార్మికులు తమ హక్కుల రక్షణకు ఐక్యంగా పోరాటల్లో పాల్గొని, కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు పిలుపు నిచ్చారు. గురువారం రోజున మేడే ఉత్సవాలలో భాగంగా పాలడుగు, పాటిమట్ల గ్రామాలలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.పని దినాలు తగ్గించాలని, చట్టపరమైన సదుపాయాలను కల్పించాలని ప్రాణాలను ప్రాణంగా పెట్టి పోరాడిన కార్మికుల సంఘటిత శక్తి వల్లే ఎనమిది గంటల పనివిధానం చట్టబద్ధమైందని అన్నారు. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి, పెట్టుబడి దారులకు కార్పొరేట్ శక్తులకు అనుకులంగా నిర్ణయాలు చేస్తూ, కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను పోరాటాల ద్వారానే తిప్పి కొట్టాలని అన్నారు. లేబర్ కోడ్ అమలులోకి వస్తే పర్మినెంట్ పద్ధతి లేకుండా, 12 గంటల పనివిధానం, వేతన పెంపు కోసం చేసే సమ్మె హక్కును కూడ హరించి, కాంటాక్ట్ వలస కార్మికులకు తక్కువ వేతనాలు ఇచ్చి, శ్రమ దోపిడికి పాల్పడేందుకు ఈ లేబర్ కోడ్ లు దోహదపడతాయని, కార్మికులు తమ హక్కుల, చట్టాల రక్షణ కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున కార్మికులు పోరాటలలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు.

ఈ కార్యక్రమం లో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, కురిమేటి యాదయ్య, రాచకొండ కనకయ్య, కొంపల్లి గంగయ్య, పిట్టల చంద్రయ్య, దొండ నాగరాజు, బండి రవి, దడిపల్లి సైదులు, మెతుకు సాయిలు, నారాయణ, వడ్డేపల్లి లక్ష్మణ్, కురిమేటి సోమయ్య, దునుక సత్యనారాయణ, కొమ్ము మల్లయ్య, మెతుకు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణ కోసమే కార్డెన్ సెర్చ్..

### రెబ్బేన సీఐ బుద్దే స్వామి

రెబ్బెన ,02 మే (క్రాంతి న్యూస్ ): కొమురం భీం జిల్లా రెబ్బెన మండలం గోలేటి గ్రామపంచాయతీలో శుక్రవారం సర్కిల్ ఇన్స్పెక్టర్ బుద్దే స్వామి, ఆధ్వర్యంలో రెబ్బేన ఎస్సై డి. చంద్రశేఖర్,మరియు పోలీస్ సిబ్బందితో కలిసి గోలేటి గ్రామంలో కార్డన్ & సెర్చ్, కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెబ్బెన సిఐ మాట్లాడుతూ.. ప్రజల భద్రత, శాంతి భద్రతా పరిస్థితుల మెరుగుదల, పోలీస్-ప్రజల మధ్య సంబంధాలు బలోపేతం చేయడంమే కార్డన్ & సెర్చ్ ప్రధాన లక్ష్యం అని అన్నారు.

గుడుంబా తయారీ,కొనుగోలు చేస్తూ పట్టుబడ్డ ఐదుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. అనంతరం

50 వాహనాలు పరిశీలించబడి, అందులో 3 వాహనాలు పత్రాలు లేకపోవడం తో స్వాధీనం చేయడం జరిగిందన్నారు. యువతలో అవగాహన పెంపొందించే ఉద్దేశ్యంతో ఒక అవగాహన కార్యక్రమం నిర్వహించామని ఇందులో ముఖ్యంగా సైబర్ నేరాలు, గంజాయి, మత్తు పదార్థాల దుష్పరిణామాలు, అక్రమ, అసాంఘిక కార్యకలాపాల, నియంత్రణ కోసం పోలీస్ శాఖ నిబద్ధతతో ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తుందని యువత బాధ్యతాయుతంగా ప్రవర్తించి, మంచి పౌరులుగా ఎదగాలని అన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

## సన్మార్గంతోనే మనస్సుకు ప్రశాంతత



సద్గురు బ్రాహ్మలిన్ బాజీ రావ్ బాబా జన్మస్థలం బేల మండలంలోని భేధొడా గ్రామంలో సప్తహా కార్యక్రమం ఘనంగా ముగిసింది. గత వారం రోజులుగా నిర్వహిస్తున్న ఈ సప్తాహ కార్యక్రమం సందర్భంగా పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి రోజూ జ్ఞానేశ్వరి పారాయన్, హరిపాట్, భజన, కీర్తన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ముగింపు సందర్భంగా గ్రామంలో పల్లకి శోభాయాత్ర నిర్వహించగా, జ్ఞానేశ్వరి, సోపాన్, ముక్తాబాయి, నివృతి ల దేవతా మూర్తుల వేశాదారణలో ఉన్న చిన్నారులను పల్లకిలో గ్రామంలో ఊరేగించాగ, భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుండి వచ్చిన భజన బృందాలు వారి ఆట పాటలతో అలరించారు. ఈ సందర్బంగా గ్రామ యువత వివిధ గ్రామాల నుండి వచ్చిన భూక్తులకు ఎండాలో మంచినీటి సౌకర్యం కల్పించారు.

కార్యక్రమ అనంతరం దహి హండి కాళ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ గత ముప్పై సంవత్సరాలనుండి బాజీరావ్ బాబా సప్తాహను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఆధునిక కాలంలో యువత చేడువేసనలకు దూరంగా ఉంటూ అధ్యాత్మికత వైపు నడుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

## బేల బి.ఆర్.ఎస్ పార్టీకి వెన్నకి రాజీనామా

బేల మండలంలో గత రెండు రోజుల క్రితం బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్ష పదివికి రాజీనామా చేస్తున్నాని కళ్లెం ప్రమోద్ రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు




చేసి తెలియజేశారు. అనంతరం ఈ రోజు పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గంభీర్ ఠాక్రె మాట్లాడుతూ ఏదైతే గత రెండు రోజుల క్రితం పార్టీ అధ్యక్ష పదివికి కళ్లెం ప్రమోద్ రెడ్డి తన వ్యక్తి గత కారణాల వల్ల రాజీనామా చేశారు కానీ పార్టీ అధిష్టానం మేరకు మళ్ళీ కళ్లెం ప్రమోద్ రెడ్డినే కొనసాగించాలని మేమందరు కోరడం జరిగింది అని ఇందులో ఎలాంటి వర్గ విబేధాలు లేవు అని పేర్కొన్నారు.

రాబోయే రోజుల్లో స్థానిక సంస్థలా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అదేవిదంగా పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమాలు ఉన్నందున ఇప్పుడు ఇలాంటి నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలని పార్టీ అధిష్టానం కోరిక మేరకు రాజీనామాను తీరస్కరించడం జరిగింది అని అన్నారు.

స్థానిక సంస్థల అనంతరం పార్టీ కార్యకర్తలు,సీనియర్ నాయకులు,అందరూ చర్చించిన తర్వాత బేల మండల అధ్యక్ష పదివి పై నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని అప్పటి వరకు మండల బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులుగా ప్రమోద్ రెడ్డి కొనసాగుతారని పేర్కొన్నారు.


## దర్శవళి ఉత్సవాలకు ప్రభుత్వ విప్,

### జిల్లా అధికారులను ఆహ్వానించిన అజీజ్ భాయ్



ఎల్లారెడ్డిపేట మే 2, (క్రాంతి న్యూస్ ): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని మక్తసింగారం గ్రామంలో గల దర్శవళి ఉత్సవాలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో పాటు జిల్లా అధికారులను శుక్రవారం ఆహ్వానించారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను రుద్రంగి మండల కేంద్రంలో కలుసుకొని ఆహ్వానించారు. అనంతరం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ ను ఆహ్వానించారు. దీంతో పాటుగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లా ఎస్పీ మహేష్ గీతే ను ఆహ్వానించారు. ఆహ్వానించిన వారిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాటి రాం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ బాయ్ సింగారం మాజీ సర్పంచ్ గొల్లపల్లి మల్లేశం, షకీల్ ఉన్నారు.

## ప్రభాకర్ పాస్టర్ మృతి తీరనిలోటు



వల్లూరి ప్రభాకర్

మంథని, మే 2 (క్రాంతి న్యూస్ ) : మంథని నియోజకవర్గ పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ వల్లూరి ప్రభాకర్ మృతి క్రైస్తవ సమాజానికి తీరనిలోటని ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్ పేర్కొన్నారు. మంథని పట్టణానికి చెందిన సీయోను ప్రార్థన మందిరంలో గత 15 సంవత్సరాలుగా క్రైస్తవ మనిచర్యలో కొనసాగుతున్నా పాస్టర్ వల్లూరి ప్రభాకర్ గురువారం ఆకస్మికంగా మృతి చెందారని ఆయన తెలిపారు. ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా మంథని ఫీల్డ్ చైర్మన్ గా, సువార్త సహవాస సంఘాల కోశాధికారి గా, తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు గా వివిధ క్రైస్తవ సంఘాలకు నాయకత్వం వహిస్తూ సేవలు అందిస్తున్నారని ఆయనను కొనియాడారు. శుక్రవారం భువనగిరిలో జరిగిన అంతిమయాత్ర కార్యక్రమంలో మంథని నియోజకవర్గంలో నుండి పాస్టర్ లు, సంఘ పెద్దలు, విశ్వాసులు పెద్ద ఎత్తున హాజరయి అయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియపరిచారు.

## భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులుగా దుగుట రాజ్ కుమార్




మంచిర్యాల,,02 మే (క్రాంతి న్యూస్ ): జైపూర్ మండలం నర్వ గ్రామానికి చెందిన దుగుట రాజ్ కుమార్ ని భారతీయ జనతా పార్టీ జైపూర్ మండల అధ్యక్షులుగా బిజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ నియమించారు. గతంలో పార్టీ నిర్మాణానికి,ఎంతగనో కృషి చేసిన రాజ్ కుమార్ ఎల్లప్పుడూ పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీకి విధేయుడుగా పని చేయటం వలన రాజ్ కుమార్ ని రెండవ సారి పార్టీ మండల అధ్యక్షులుగా నియమించటం పట్ల మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో నాకు రెండవసారి పార్టీ అధ్యక్ష పదవికి అవకాశం కల్పించటం పట్ల పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కి విధేయుడుగా ఉంటూ నా శక్తికి మించి పార్టీ ని మండలంలో ముందు వరుసలో ఉండేలా కృషి చేస్తానని అన్నారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోడి, కేంద్ర ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజలకు తెలియజేస్తానాని తెలిపారు.

## దేశంలోనే తొలిసారిగా మన దగ్గరే, ఏపీ ప్రభుత్వం కీలక ఒప్పందం



అమరావతి ,02 మే (క్రాంతి న్యూస్ )::రాజధాని అమరావతి పునఃప్రారంభోత్సవం రోజున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీ శుభవార్త అందింది. అమరావతిలో అత్యాధునిక క్వాంటం వ్యాలీ ఏర్పాటు కానుంది. భారతదేశంలోనే తొలి క్వాంటం వ్యాలీ అమరావతిలో ఏర్పాటు కానుంది.అమరావతి కేంద్రంగా 2026 జనవరి ఒకటో తేదీ నుంచి క్వాంటం కంప్యూటింగ్ కార్యకలాపాలు ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. శుక్రవారం ఉండవల్లిలోని చంద్రబాబు నాయుడు నివాసంలో ఏపీ ప్రభుత్వం ఐబీఎం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ , ఎల్అండ్టీ సంస్థలతో అవగాహన ఒప్పందం చేసుకుంది.

క్వాంటం వ్యాలీ ఏర్పాటు కోసం చేసుకున్న ఈ ఒప్పందం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మాత్రమే కాదు., భారతదేశానికి కూడా చరిత్రాత్మకం అని చంద్రబాబు నాయుడు అభిప్రాయపడ్డారు. క్వాంటమ్ కంప్యూటింగ్ నూతన ఆవిష్కరణలకు, భవిష్యత్ పాలనకు పునాది అవుతుందన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతోందన్న చంద్రబాబు నాయుడు.. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి కొత్త టెక్నాలజీలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. నేటి యువత ఎప్పటికప్పుడు వాటిని అందిపుచ్చుకోవడం ముఖ్యమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. భవిష్యత్ అవసరాలన్నీ ఈ టెక్నాలజీలపైనే ఆధారపడి ఉంటాయని చెప్పారు. సిలికాన్ వ్యాలీ తరహాలో అమరావతి క్వాంటం వ్యాలీ తీర్చిదిద్దుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు

క్వాంటం వ్యాలీ ప్రాజెక్టు కోసం ఏపీ ప్రభుత్వం అమరావతిలో 50 ఎకరాలు కేటాయించింది. ఇప్పటికే ఈ ప్రాంతానికి వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అమరావతి క్వాంటం వ్యాలీలో ఐబీఎం ద్వారా రూపొందించిన ల్యాండ్ మార్క్ ఐకానిక్ భవనం ఏర్పాటు కానుంది. క్వాంటం కంప్యూటింగ్ అవసరాల కోసం ప్రత్యేక ఆన్‌లైన్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఈ ప్రాజెక్టు వేగంగా అమలయ్యేలా చూడాలని ఇప్పటికే చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు కోసం అధికారులు వేగంగా చర్యలు తీసుకుంటున్నారు.

మరోవైపు అమరావతి రాజధాని నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అమరావతి పునఃప్రారంభోత్సవం జరిగింది. అనంతరం పలు ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు చేశారు.

## కూటమి ప్రభుత్వ రాకతో అమరావతి బంగారు బాట



అమరావతి,02 మే (క్రాంతి న్యూస్ ):అమరావతి నిర్మాణ పున:ప్రారంభం తెలుగుజాతికి ఎనలేని సంతోషాల సంబరమని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. నేడు ప్రారంభమయ్యే పనుల జోరు..ఇకపై రాష్ట్రానికి తీసుకువచ్చే పరిశ్రమలు, పెట్టుబడుల హోరని అన్నారు. జగన్ దుష్ట, స్వార్థ రాజకీయాలకు బలైన అమరావతి కూటమి ప్రభుత్వ రాకతో బతికి బంగారు బాటపట్టిందని చెప్పారు. అమరావతి కోసం 1631 రోజులు పోరాడిన రైతుల ఆనందభాష్పాలు, భావోద్వేగాలతో నేటి అమరావతి సభ పులకిస్తుందని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.

మోదీ చేతులమీదుగా రూ.49వేల కోట్ల అమరావతి అభివృద్ధి పనులకు బీజం పడటం తెలుగుజాతికే గర్వకారణమని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ శుభదినం దేశచరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన గొప్పదినమని ఉద్ఘాటించారు. మూడేళ్లలో రాజధాని పనులు పూర్తి అవుతాయని చెప్పారు. పాలకుల ఆకాంక్షలు ఫలించి, ప్రజలకు అమరావతి ఫలాలు అందించాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు. ఇకపై ప్రతి ఆంధ్రుడు తన రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకుంటారని ఉద్ఘాటించారు. అమరావతిని ఏడారి, శ్మశానమన్న వైసీపీ నేతలు సిగ్గుతో తలలు దించుకొని రాజధానిలో తిరగడం అందరూ చూస్తారని ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.

చంద్రబాబు నేతృత్వంలో రాజధాని కల నెరవేరనుంది: మంత్రి సవిత

అమరావతి రాజధాని పునర్నిర్మాణ వేడుకలో భాగస్వాములవ్వడం ఆనందంగా ఉందని మంత్రి సవిత అన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీ వాసుల ప్రజా రాజధాని కల నెరవేరనుందని తెలిపారు. రాజధాని పనుల పున:ప్రారంభానికి ముఖ్య అతిథిగా వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయ పూర్వక స్వాగతం తెలిపారు. పెనుకొండ నియోజకవర్గం నుంచి 10 బస్సులు, 20కు పైగా కార్లలో కూటమి శ్రేణుల అమరావతికి చేరుకున్నారని మంత్రి సవిత చెప్పారు. గుంటూరు టోల్ గేట్ కాజా దగ్గర పెనుకొండ కూటమి నాయకులకు మంత్రి సవిత స్వాగతం పలికారు. కూటమి నాయకులకు అల్పాహారం, పండ్లను మంత్రి సవిత పంపిణీ చేశారు.

## విశాఖ భూములపై సురేష్ ప్రొడక్షన్స్‌కు షాక్.. నో చెప్పిన సుప్రీం కోర్టు, కీలక ఆదేశాలు




విశాఖపట్నం, 02 మే (క్రాంతి న్యూస్ ): విశాఖపట్నంలో రామానాయుడు స్టూడియో భూముల వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. ఏపీ ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీసుల్ని సవాల్ చేస్తూ సురేష్ ప్రొడక్షన్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం విచారణ జరిపింది. ఈ పిటిషన్‌లో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది.. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం కుదరదని తేల్చి చెప్పింది. ఒకవేళ అవసరం అనుకుంటే కనుక ప్రభుత్వ షోకాజ్ నోటీసుపై సంబంధిత కోర్టును ఆశ్రయించాలని సూచించింది. అయితే ఈ పిటిషన్‌ను వెనక్కు తీసుకుంటామని (ఉపసంహరించుకుంటామని) సురేష్ ప్రొడక్షన్స్ కోరగా ధర్మాసనం అనుమతించింది.

గతంలో ఫిల్మ్‌సిటీ కోసం రామానాయుడు స్టూడియోస్‌కు కేటాయించిన భూములను.. ఇతర అవసరాలకు వాడుకోవచ్చని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సురేష్ ప్రొడక్షన్స్‌కు అనుమతి ఇచ్చింది. ఈక్రమంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ భూములపై షోకాజ్ నోటీసు ఇచ్చింది. గత ప్రభుత్వ నిర్ణయాన్ని ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలని వివరణ కోరింది.. ఈ నోటీసుల్ని సురేష్ ప్రొడక్షన్స్ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా విచారణ జరిగింది. సుప్రీం కోర్టు జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది.

విశాఖపట్నంలో రామానాయుడు స్టూడియో కోసం 34.44 ఎకరాల భూమిని కేటాయించిన సంగతి తెలిసిందే. అయితే ఈ భూమిలో 15.17 ఎకరాలను ఇతర అవసరాల కోసం ఉపయోగిస్తామని రామానాయుడు స్టూడియో కోరింది.. గత ప్రభుత్వం అనుమతిని ఇచ్చింది. ఆ వెంటనే స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. జనసేన పార్టీ మూర్తి యాదవ్ గత ప్రభుత్వ హయాంలో నిర్ణయంపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఈ భూములను స్టూడియో కోసం ఉపయోగించాలని ఆదేశించిన సుప్రీం కోర్టు.. లేఅవుట్ సాగించే అమ్మకాలపై స్టే విధించిన సంగతి తెలిసిందే.

గత నెలలో విశాఖపట్నంలోని రామానాయుడు స్టూడియోకు కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. రెండు వారాల్లో వివరణ ఇవ్వాలని.. ఆ తర్వాత చర్యలు ఉంటాయని నోటీసుల్లో పేర్కొన్నారు. రామానాయుడు స్టూడియో నిర్మాణం కోసం ప్రభుత్వం 34 ఎకరాలు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ భూమిలో 15.17 ఎకరాలను హౌసింగ్ లేఅవుట్ కోసం మార్పు చేయాలని సంబంధిత యాజమన్యం కోరిందని.. ఇది నిబంధనలకు విరుద్ధమని నోటీసులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ భూమిని ఇతర అవసరాల కోసం ఉపయోగిస్తే.. ఆ భూముల్ని రద్దు చేయాలన్న సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చర్యలకు సిద్ధమయ్యారు.. అందుకే కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. తాజాగా ఏపీ ప్రభుత్వం జారీ చేసిన నోటీసులపై సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. అక్కడ కూడా ఊరట దక్కలేదు. సురేష్ ప్రొడక్షన్స్ ఏపీ హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఉందంటున్నారు.

## ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం.. త్వరలో బీసీలకు కేంద్ర మంత్రి పదవి వస్తుందన్న కృష్ణయ్య!



విజయవాడ,02 మే (క్రాంతి న్యూస్ ):విజయవాడలో ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య పాలాభిషేకం చేశారు. బీసీల పట్ల మోడీకి ఉన్న ప్రేమ, చిత్తశుద్ధి వల్లే కులగణన సాధ్యమైందన్నారు. కులాల లెక్కలు తీయడం ద్వారా బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్లు లభించనున్నాయని పేర్కొన్నారు. ఇది బీసీల విజయం మాత్రమే కాదు.. దేశంలో ఓ కొత్త శకానికి నాంది అని వ్యాఖ్యానించారు. జనగణనలో కుల గణన చేయడానికి స్వాతంత్ర్యం ఉన్నప్పటికీ గతంలో ఏ ప్రభుత్వమూ ముందుకు రాలేదని విమర్శించారు. అనేక కమిషన్లకు లెక్కలు ఇచ్చినప్పటికీ వాటిని పట్టించుకోలేదని తెలిపారు. మోడీ ఓబీసీల పట్ల నిజమైన కమిట్‌మెంట్ ఉన్న నాయకుడు అని ప్రశంసించారు. త్వరలోనే బీసీలకు కేంద్ర మంత్రి పదవి లభించనుందని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కులగణనపై చిత్తశుద్ధితో వ్యవహరించలేదని కృష్ణయ్య ఆరోపించారు.

ఇక ప్రధాని నరేంద్ర మోడీ అమరావతి పర్యటనను చారిత్రక ఘట్టం అన్నారు ఆర్. కృష్ణయ్య. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు రాజధాని విషయంలో స్పష్టత లేకపోయినప్పటికీ, ఇప్పుడు అమరావతి అభివృద్ధి బాట పట్టిందని చెప్పారు. హైదరాబాద్‌లో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసిన చంద్రబాబు, అమరావతిని అదే విధంగా అభివృద్ధి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారని అన్నారు కృష్ణయ్య. బీసీలు భారత మాత ముద్దు బిడ్డలు.. ఇది బీసీల మొదటి విజయం కాదు దేశంలో ఓ కొత్త శకం ప్రారంభమైందన్నారు. కొన్ని పార్టీలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. వరుసగా ఎన్నికల్లో మోడీ గెలుస్తున్నారు, మోడీ ఓబీసీల పట్ల నిజమైన కమిట్‌మెంట్ ఉన్న నాయకుడు, మోడీ నాయకత్వంలో బీసీలకు మంచి జరిగింది, త్వరలో బీసీలకు కేంద్ర మంత్రిపదవి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు కృష్ణయ్య. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కులగణన చేపట్టలేదు, లెక్కలు తీసుకుంది, కులగణనపై కాంగ్రెస్‌కు నిజమైన చిత్తశుద్ధి లేదని విమర్శించారు బీజేపీ రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య.

## తరతరాలు గర్వపడేలా అమరావతిని నిర్మిస్తాం: మంత్రి నారాయణ



అమరావతి,02 మే (క్రాంతి న్యూస్ )::ఏపీ కలల రాజధాని అమరావతిని తరతరాలు గర్వపడేలా నిర్మిస్తామని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. సభలో ఆయన ప్రసంగించారు. “పదేళ్ల క్రితం ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని పురుడు పోసుకుంది. పునఃప్రారంభం కూడా ఆయన చేతుల మీదుగా జరగడం మన అదృష్టం. గతంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన ఒకే ఒక్క పిలుపుతో 29 గ్రామాల్లో 29,373మంది రైతులు కేవలం 58 రోజుల్లోనే ఒక్క సమస్య కూడా లేకుండా 34వేల ఎకరాల భూమిని అమరావతి కోసం త్యాగం చేయడం దేశ చరిత్రలోనే ప్రథమం. అమరావతి రైతుల త్యాగం వెలకట్టలేనిది. అమరావతి కోసం ఎన్నో త్యాగాలు చేసిన రైతులకు నా పాదాభివందనం” అన్నారు.

“ప్రపంచంలోనే టాప్ 5 రాజధానుల్లో ఒకటిగా అమరావతిని నిర్మించాలనే లక్ష్యంతో 2014-19లోనే రూ.40వేల కోట్ల విలువైన పనులు ప్రారంభించాం. దాదాపు రూ.9వేల కోట్ల పనులు పూర్తి చేశాం. గత ప్రభుత్వం నిర్వాకంతో గత ఐదేళ్లలో రాజధాని పనులు నిలిచిపోయాయి. అధికారంలోకి వస్తే అమరావతిని పూర్తి చేస్తామని కూటమి తరపున ఎన్నికల ముందు చెప్పాం. ప్రధాని ఆశీస్సులతో సీఎం చంద్రబాబు సారథ్యంలో మూడేళ్లలో అమరావతి నిర్మాణ పనులు పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటాం” అని మంత్రి నారాయణ అన్నారు

## రాజధాని పునః ప్రారంభోత్సవం.. ప్రత్యేక ఆకర్షణగా 'ఐరన్' శిల్పాలు




అమరావతి,02 మే (క్రాంతి న్యూస్ ):రాజధాని అమరావతి పునః ప్రారంభోత్సవానికి రంగం సిద్ధమైంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ప్రజలు రాజధాని ప్రాంతానికి చేరుకుంటున్నారు. సభావేదిక వద్ద ఏర్పాటు చేసిన శిల్పాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బుద్ధుడు, కాలచక్రం, ఎన్టీఆర్, ప్రధాని నరేంద్రమోదీ విగ్రహాలతో పాటు మేక్ ఇన్ ఇండియా లోగో ఆకట్టుకుంటున్నాయి. దీంతో పాటు 'అమరావతి' అక్షరాలను రూపొందించారు. వీటిని ఐరన్ స్క్రాప్‌తో శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు తీర్చిదిద్దారు.

KR TV మన క్రాంతి



# మావోయిస్టులను ఎన్కౌంటర్ చేయడం రాజ్యాంగ విరుద్ధం

**■దేశవ్యాప్తంగా మోడీ,అమిత్ షా, రాక్షస పాలన నడుస్తుంది ■ఆపరేషన్ కగార్ పేరుతో ఇప్పటికే 350 మందికి పైగా మావోయిస్టులను ఎన్కౌంటర్ చేశారు ■ మావోయిస్టు ఎన్కౌంటర్లపై ప్రశ్నించిన వారిపై అర్బన్ నక్సలైట్లుగా, ఉప చట్టం కేసులు పెట్టడం సిగ్గుచేటు ■ పభుత్వ ప్రధాన సలహాదారులు కే కేశవరావు ఎన్కౌంటర్లు ఆపాలని శాంతి చర్చలు జరపాలని కేంద్రానికి రాసిన లేఖను అంగీకరించాలి ■ తిప్పారపు సంపత్ టిపిసిసి ఎస్సి డిపార్ట్మెంట్ అట్రాసిటీ రాష్ట్ర ఇంచార్జి**



హుజురాబాద్ మే 2(క్రాంతి న్యూస్ ): హుజురాబాద్ పట్టణం విలేకరుల సమావేశంలో తిప్పారపు సంపత్ టి పి సి సి ఎస్ సి డిపార్ట్మెంట్ రాష్ట్ర అట్రాసిటీ ఇంచార్జ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రలలో ఛత్తీస్గఢ్ ఒరిస్సా,మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్ర సరిహద్దులలో ఆపరేషన్ కగార్ పేరుతో ఎంతోమందిని ఎన్కౌంటర్ చేసి అందులో చాలా మంది ప్రాణాలు కోల్పోవడం జరుగుతుంది. గిరిజనులు,చెంచులు,గోండులు, దళితులు ఆయా సామాజిక వర్గాలకు కనీసం కూడు,గూడు,గుడ్డ సౌకర్యాలు కల్పించవలసిన బాధ్యత కేంద్రానికి ఉన్న కూడా దానిని మరిచి అగ్రవర్ణాల కులాలకు, కార్పొరేట్ కంపెనీలకు అడవి ఆస్తి దోచి పెట్టాలని ప్రధాన లక్ష్యంతో మోడీ,అమిత్ షా , ఆడుతున్న నాటకంలో మావోయిస్టులు బలైపోతున్నారు మావోయిస్టులను నిర్మూలించాలంటే ప్రాణాలు తీయడం కాదని ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని స్పష్టంగా తెలియజేస్తున్నాం,మోడీ,అమిత్ షా, గాని మావోయిస్టుల పార్టీ నిషేధించిన పార్టీ అని చెప్పుతున్నారు కానీ మీ RSS దేశంలో నాలుగు సార్లు 1947,1948,1975 నుండి 1977 వరకు,1992 నిషేధించ బడింది అప్పుడు మీ RSS వారిని ఎవరిని కూడా ఎన్కౌంటర్ చేయలేదు కదా అని గుర్తు చేస్తున్నాము. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మావోయిస్టులను సలండర్ చేపించాలి.కానీ కాల్చి చంపడం సరికాదుఅన్నారు మనుషుల ప్రాణాలు చాలా విలువైనవి వెలగట్టలేనివి మావోయిస్టులు గత నెల నుండి శాంతి చర్చలు జరుపుదామని కాల్పుల విరమణ చేయమని చెప్పి లేఖలు కూడా రాశారు దానికి కేంద్రం స్పందించడం లేదు మొండి వైఖరితో మావోయిస్టుల ప్రాణాలు తీస్తున్నారు. మా నాయకుడు రాహుల్ గాంధీ అనేకసార్లు ఎన్కౌంటర్లు సరైన పద్ధతి కాదని మావోయిస్టుల సమస్య దీర్ఘకాలిక సమస్యఅని దానిని పరిష్కరించాలని కేంద్రానికి విన్నవించడం జరిగింది. మా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణ చేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ముఖ్య మంత్రివర్యులు రేవంత్ రెడ్డి, కే కేశవ రావు, జానారెడ్డి గార్లు చర్చలు జరిపి ఇప్పటికే కేంద్రానికి లేఖ రాయడం జరిగింది.మోడీ అమిత్ షా గార్లు రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉంటే మావోయిస్టులతో చర్చలు జరపాలి కాల్పుల విరమణ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాము ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ జీడి రవితేజ, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు చల్లూరి రాహుల్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు సంపంగి అరుణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.సైదాపూర్ మండల నూతన ఎమ్మార్వోగా వీధులు చేపట్టిన

# దేశ రక్షకుడి తో... విద్యా రక్షకుడు

## నారాయణ.. నారాయణ సంస్థల అధినేత

అమరావతి అమరావతికి పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు, ప్రత్యేక అతిథిగా వచ్చిన దేశ ప్రధాని నరేంద్ర మోడీని, నారాయణ విద్యాసంస్థల అధినేత, ఏపీ పురపాలక శాఖ మంత్రి పొంగూరి నారాయణ, ప్రధానిని మర్యాదపూర్వకంగా



కలిశారు, విద్యా వ్యవస్థ, లో జరుగుతున్న విషయాలని, అలాగే మంత్రిగా తన శాఖకు సంబంధించి ప్రధానితో చర్చించారు, ఈ దేశంలో ఏడువందల నారాయణ విద్యాసంస్థలు ఉన్నాయని, ఇటీవల ప్రకటించిన అన్ని జాతీయ రాష్ట్ర పరీక్షల్లో, తమ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారని, గత ఐదు దశాబ్దంగా విద్యను అభివృద్ధి చేశారని, ప్రజాసేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చానని, రాజకీయాల్లో ఎంత ఎదిగిన, తనకు ఈ పేరు ప్రఖ్యాతలు ఇచ్చినటువంటి విద్యాసంస్థలను మరచిపోనని, నేను ఏ హోదాలో ఉన్న, నా విద్యా సంస్థలను కాపాడుకుంటానని, లక్షల్లో విద్యార్థులు, వేళల్లో గురువులు, వందల కుటుంబాలు మా విద్యాసంస్థ పైన ఆధారపడి ఉన్నారని అధినేత నారాయణ అన్నారు

# నాకు పెళ్లి వద్దు నన్ను ఎలాగైనా చదివించండి మేయర్ మేడమ్... గిరిజన బాలిక...

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ( బాలికలు) కోట నందు 7 వ తరగతి పూర్తి చేసి 23 వ తేదీ వేసవి సెలవులకు ఇంటికి వెళ్ళిన నాగుల సునీత అనే గిరిజన బాలికకు తల్లిదండ్రులు కొట్టి బలవంతంగా పెళ్లి చేసిన విషయం తెలిసిందే. ఈ విషయం ప్రచార మద్యామాలు ద్వారా తెలుసుకున్న యానాది విద్యా చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు పులి చెంచయ్య ఈ విషయం నెల్లూరు నగర మేయర్ పోట్లూరి స్రవంతికి తెలియజేయడం జరిగింది. ఆమే విషయం తెలుసుకున్న వెంటనే ఆ గిరిజన బాలిక ఉంటున్న నెల్లూరు బాలసదన్ కు వెళ్ళడం జరిగింది. ఆ అమ్మాయిని పిలిచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ గిరిజన బాలిక మేయర్ తో నాకు పెళ్లి వద్దని నేను బాగా చదువుకోవాలని మేయర్ వద్ద బోరున విలపించింది. ఆ అమ్మాయిని ఓదారుస్తూ నీ చదువు మేము అండగా ఉంటామని మీ తల్లిదండ్రులతో మాట్లాడి వేసవి సెలవులు అనంతరం నిన్ను మరల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో చేర్పించి చదివిస్తామని హామి ఇచ్చారు.కట్టుబట్టలతో అర్ధరాత్రి ఇంటి నుండి ఉపాధ్యాయుల సహాయం తో నెల్లూరు బాల సదన్ కు చేరిన విషయం తెలిసిందే . ఈ విషయం లో వెంటనే స్పందించిన ప్రిన్సిపాల్ రజనీ కి %ుణూ్రూ% మల్లికార్జున రెడ్డి కి యానాది విద్యా చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు పులి చెంచయ్య, దాసరి పోలయ్య,వేటగిరి సుధాకర్ రావు,యాకసిరి లోక్ సాయి, కార్తిక్ అభినందనలు తెలిపారు. నెల్లూరు నగర మేయర్ పోట్లూరి స్రవంతి కి గిరిజన యానాది విద్యా చైతన్య వేదిక నాయకులు పులి చెంచయ్య ధన్యవాదాలు తెలిపారు......

# ప్రధాని మోడీకి క్షీరాభిషేకం...

**బిజెపి నాయకుల భారీ ర్యాలీ..**

**కుల గణన చేసే ధైర్యం ఒక బీజేపీకే సాధ్యం..**

**కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ కాళి ప్రసాద్ రావు.**



పరకాల,మే 2 (క్రాంతి న్యూస్ ) కులగణన చేసే ధైర్యం ఒక బిజెపి ప్రభుత్వానికి ఉందని పరకాల కాంటెస్టెంట్ ఎమ్మెల్యే డాక్టర్ కాళి ప్రసాద్ రావు పేర్కొన్నారు. శుక్రవారం పరకాల బిజెపి పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో కుల గణనను కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో పరకాల పట్టణంలో బిజెపి నాయకులు పరకాల అమరవీరుల దామం నుండి బస్టాండ్ కూడలి వరకు డప్పు సప్పులతో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ కూడాలి వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పరకాల బిజెపి కాంటెస్ట్ ఎమ్మెల్యే డాక్టర్ కాళి ప్రసాద్ రావు, డాక్టర్ పెసరు విజయ చందర్ రెడ్డి గారు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

వారు మాట్లాడుతూ కుల గణన పోరాటం నిన్న మొన్నటి పోరాటం మాత్రమే కాదు. ఈ పోరాటం అనేక దశాబ్దాలుగా నడిచిందని,1960 దశకం నుండే ఈ పోరాటం మొదలై నేటికీ కొనసాగుతూ వచ్చింది. మొదటి నుండి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏనాడూ కుల గణనకు అనుకూలంగా వ్యవహరించ లేదు. మోడీ ప్రభుత్వం, కుల గణనకు ఒక విధాన వైఖరిని తీసుకొని, ఆమేరకు సుప్రీంకోర్టులో, సెప్టెంబరు 2021లో అఫిడవిట్ దాఖలు చేశారని తెలిపారు. మన ప్రధాన నరేంద్ర మోడీ కులగనకు కట్టుబడి ఉన్నారని కులగణలో అన్ని వర్గాలకు న్యాయం జరిగే విధంగా ప్రణాళికలు తయారు చేస్తున్నారని అలాంటి గట్స్ ఉన్న మన నరేంద్ర మోడీ తోపాటు బిజెపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో డబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందని అదేవిధంగా స్థానిక ఎన్నికలలో సైతం బిజెపి పటిష్టమవుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పరకాల రూరల్ అధ్యక్షులు రాజ్ కుమార్ నడికుడ మండల అధ్యక్షుడు ఎరుకల దివాకర్ ఆర్.బి జయంత్ లాల్ మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి మాజీ చైర్మన్ రాజభద్రయ్య బిజెపి నాయకులు కుక్కల విజయ్ సంఘ పురుషోత్తం మార్త బిక్షపతి బాసాని సోమరాజు వెనిశెట్టి శారద భాస్కరాచారి ఆకుల రాంబాబు కోడల లింగమూర్తి కానుగుల గోపీనాథ్ పావు శెట్టి శ్రీనివాస్ ముత్యాల దేవేందర్ మెంతులు సురేష్ సారంగనరేష్ ఆకుల రాజేందర్ సంఘ నరేష్ పాలకుర్తి ప్రతాప్ సాదా మధుకర్కాసగాని రాజ్ కుమార్ గౌడ్

G. నర్సయ్య J. రాజేందర్ రావు D. దేవరాజ్ K. సాంబయ్య బాలాజీ మురళి కృష్ణ V. బిక్షపతి A. సురేష్ R. శశిదర్ రెడ్డి

దండు సురేష్, తిప్పరపు సుధీర్, సింగవేనా రవీందర్ యాదవ్, కుమారస్వామి, సల్పలా సురేష్, మోతె మధుసూదన్ రెడ్డి, కోటేశ్వర్

# పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయునికి టా ప్ర ఆధ్వర్యంలో ఘన సన్మానం



హుజురాబాద్ మే 2(క్రాంతి న్యూస్ ): తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ హుజురాబాద్ శాఖ ఆధ్వర్యంలో హుజూరాబాద్ పట్టణం సైదాపూర్ రోడ్డులో గల శ్రీ వెంకటేశ్వర మ్యారేజ్ బ్యూరో కార్యాలయంలో ఇటీవల పదవి విరమణ పొందిన పెద్ద పేట రమేష్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్రావుపల్లి ని ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టా ప్ర కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా భావి భారత పౌరుల విద్యాభివృద్ధి కొరకు ఉపాధ్యాయునిగా ఉత్తమ సేవలందించిన రమేష్ ను ఈ సందర్భంగా అభినందించినారు పదవీ విరమణ పొందిన పెన్షనర్స్ విశ్రాంతి తీసుకుని హాయిగా తమ జీవితాన్ని గడపవలసినటువంటి తరుణంలో పెండింగ్ డీఏ ల కొరకు పిఆర్సి కొరకు హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేయడము ప్రభుత్వం యొక్క పనితీరుకు నిదర్శనం అన్నారు మార్చ్ 2024 నుండి పదవి విరమణ పొందిన పెన్షనర్స్ అందరికి వెంటనే పెన్షనరీ బెనిఫిట్స్ మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టా ప్ర డిమాండ్ చేస్తుందన్నారు కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బోంగోని వెంకటయ్య రావి కంటి రామకృష్ణయ్య హుజరాబాద్ శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శనిగరం నరేందర్ చీకట్ల సమ్మయ్య కోశాధికారి మండల వీరస్వామి నాయకులు తాటిపాముల కనకయ్య గూడూరి స్వామి రెడ్డి తౌటం శ్రీహరి దొంత హరికిషన్ తిరునహరి సనత్ కుమార్ చొల్లేటి మల్లారెడ్డి ముక్కెర మొగిలి గాజర్ల బుచ్చి రాజం గౌరీశెట్టి సాంబయ్య గాజర్ల గంగయ్య తాళ్లపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# కమ్యూనిస్టు పాలనలోనే ప్రజా సమస్యల పరిష్కారం... --ద్యోగాు ,స్వేచ్ఛ, స్వాతంత్ర్యం.

మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం మే 2 (క్రాంతి న్యూస్ )76 యేండ్లుగా పరిపాలించిన పార్టీలైన బీజేపీ,కాంగ్రెస్ ఖూర్ఖు అబ పాలనలో ప్రజలు సమస్యల సుడిగుండంలో చిక్కుకోవడం జరిగింది. 139 మేడే వారోత్సవాల సందర్భంగా ఈ రోజు వేమనపల్లి మండలం బుయ్యారం గ్రామంలో రెండు కేంద్రాల్లో మరమల మల్లీశ్వరి,శంకర్,గోగర్ల లక్ష్మి గార్ల నాయకత్వంలో

సీపీఎం జెండా ఎగుర వెయ్యడం జరిగింది.

ఈ కార్యక్రమానికి సంకె రవి సీపీఎం మంచిర్యాల జిల్లా కార్యదర్శి,గుమసా అశోక్ %జూవీ% మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యులు హాజరై మాట్లాడడం జరిగింది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సం.రాలు గడిచిపోయిన నేటికీ పేదల ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదు.పైగా పేదరికం పెరిగిపోయింది.

భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కులైనా ప్రతి ఒక్కరికీ ఇళు ్శ, చదువు, ఉద్యోగం,ఆరోగ్యం నేటికీ అందని ద్రాక్షలాగా మిగిలిపోయింది.

పాలకులు,కార్పొరేట్ సంస్థల యజమాన్యలకు ఊడిగం చెయ్యడం జరుగుతుంది. వేమనపల్లి మండలంలో అన్ని గ్రామాల్లో పారెస్ట్ శాఖ అధికారులు పేదల సాగులో ఉన్న భూములను,పట్టా భూములను సాగు చేసుకొనివ్వడం లేదు.

పేదలపై అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చెయ్యడం జరుగుతుంది.

పేదలు నివాస ముంటున్న గ్రామాల్లో గుడుంబా,బెల్ట్ షాపులల్లో మద్యం ఏరులై





పారుతున్న ఎక్సైజ్,పోలీస్ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.దీనివలన పేదలు,

వారి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ప్రతి కుటుంబానికి ఇళు ్శ,భూమి,ఉద్యోగం,స్వేచ్ఛ అనే రాజ్యాంగ హక్కులను కూడ నేటి పాలకులు అమలు చెయ్యడం లేదు..

నేడు ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య సోషలిస్టు వ్యవస్థలో పరిష్కారం జరుగుతాయి. ప్రజలు సీపీఎం పార్టీని బలోపేతం చేయడం ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని పిలుపు నివ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో కామెర మధుకర్,సరిత,బొందయ్య,మల్లయ్య,రామయ్య, జయ మరియు ప్రజలు పాల్గొన్నారు.



ఆరోగ్య క్రాంతి
శనివారం 03-05-2025
epaper.krtvnews.com

## ఉన్నట్లుండి సడెన్‌గా
# స్పృహ తప్పి పడిపోతున్నారా..

హెల్త్ న్యూస్ ,02 ఏప్రిల్ (క్రాంతి న్యూస్ ): అప్పటి వరకు కొందరు బాగానే ఉంటారు. కానీ ఉన్నట్లుండి స్పృహ తప్పి పడిపోతుంటారు. మెదడుకు రక్త సరఫరా నిలిచిపోవడం వల్ల ఇలా జరుగుతుంది. ఎవరైన సరే స్పృహ తప్పి పడిపోయేందుకు అనేక కారణాలు ఉంటాయి. ఎక్కువ సమయం పాటు నిలబడి ఉన్నా, తీవ్రమైన ఒత్తిడి బారిన పడినా, రక్తం చూసినా, ఎక్కువ వేడికి గురైనా, డీహైడ్రేషన్ బారిన పడినా లేదా తీవ్రమైన వ్యాయామం, శారీరక శ్రమ చేసినా స్పృహ తప్పి పడిపోతుంటారు. దగ్గు వచ్చినప్పుడు, తుమ్మినప్పుడు, నవ్వినప్పుడు, ఏదైనా మింగినప్పుడు, మూత్ర విసర్జన చేసినప్పుడు కూడా కొందరు ఉన్నట్లుండి షాక్‌కు గురవుతారు. దీంతో స్పృహ తప్పి పడిపోతారు. మెడపై ఉండే కెరోటిడ్ అనే రక్తనాళంపై ఒత్తిడి కలిగించినా కూడా స్పృహ తప్పుతారు. సాధారణంగా ఈ సమస్య ఆ భాగంపై గట్టిగా దెబ్బ తగలడం లేదా మెడ బిగుతుగా ఉండే దుస్తులను ధరించడం వల్ల వస్తుంది.

కారణాలు ఇవే..

కొందరు ఎక్కువ సమయం పాటు నిలబడి ఉంటే వారి బీపీ లెవల్స్ పడిపోతాయి. దీంతో ఆటోమేటిగ్గా వారు స్పృహ తప్పి పడిపోతారు. ఎండ వేడి కారణంగా చాలా మందికి ఒంట్లోని నీరు త్వరగా ఆవిరైపోతుంది. దీన్నే డీహైడ్రేషన్ అని కూడా అంటారు. ఇలాంటి స్థితిలో నీళ్లను లేదా శరీరానికి ద్రవాలను అందించే ఆహారాలను తీసుకోవాలి. లేదంటే డీహైడ్రేషన్ అధికమై స్పృహ తప్పి పడిపోతారు. అలాగే డైయురెటిక్స్, బీపీ మందులు, షుగర్ మందులు, యాంటీ డిప్రెసెంట్ మందులను వాడే వారిలో కూడా తరచూ స్పృహ తప్పిపోవడం కనిపిస్తుంది. గుండె రక్తాన్ని వేగంగా పంప్ చేసినా కూడా ఈ సమస్య వస్తుంది. నాడీ సంబంధ వ్యాధులు ఉన్నవారిలో కూడా స్పృహ తప్పి పడిపోవడం అనే సమస్య కనిపిస్తుంది. దయాబెటిస్, థైరాయిడ్ సమస్యలు ఉండడం, ఎక్కువ సమయం పాటు అతిగా నిద్రించడం, వయస్సు మీద పడడం వంటివి కూడా స్పృహ తప్పడానికి కారణం అవుతుంటాయి.

ఈ లక్షణాలు కూడా ఉన్నాయా..

స్పృహ తప్పి పడిపోవడం అన్నది సాధారణ సమస్యే అయినప్పటికీ కొన్ని సందర్భాల్లో ఇది ప్రాణాంతకం అవుతుంది. స్పృహ తప్పి పడిపోయే వారు ఇతర ఎలాంటి లక్షణాలు కనిపించకపోతే ఆందోళన చెందాల్సిన పనిలేదు. కాసేపటికి అంతా సర్దుకుంటుంది. కానీ దీంతోపాటు పలు లక్షణాలు కనిపిస్తే మాత్రం జాగ్రత్త పడాల్సిందే. ముఖ్యంగా



ఇలాంటి స్థితిలో తల తిరగడం లేదా వాంతికి వచ్చినట్లు ఉండడం, వికారం, చెమటలు బాగా పట్టడం, చర్మం పాలిపోయినట్లు తెల్లగా మారడం, నీరసంగా ఉండడం, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తుంటే అప్పుడు నిర్లక్ష్యం చేయకూడదు. వెంటనే డాక్టర్‌ను కలవాలి. అలాగే తరచూ స్పృహ తప్పి పడిపోతున్నా, గుండె సంబంధిత సమస్యలు ఉన్నా, ఛాతిలో నొప్పి రావడం, శ్వాస తీసుకోవడం కష్టంగా ఉండడం, వ్యాయామం చేసేటప్పుడు పడిపోవడం, కుటుంబంలో అంతకు ముందు ఎవరైనా సడెన్‌గా స్ట్రోక్ తో చనిపోవడం జరిగినా.. కచ్చితంగా అప్రమత్తంగా ఉండాలి.

ఏం చేయాలి..

స్పృహ తప్పి పడిపోయిన వారు వెంటనే నీళ్లను తాగితే శరీరంలోకి ద్రవాలు చేరుతాయి. దీంతో ఈ సమస్య నుంచి తాత్కాలికంగా ఉపశమనం లభిస్తుంది. అందుకనే స్పృహ తప్పిన వారిపై నీళ్లను చల్లుతారు. ఇది ఒక షాక్ లాంటి ఎఫెక్ట్‌ను ఇస్తుంది. దీంతో స్పృహ తప్పిన వారు వెంటనే లేస్తారు. అలాగే ఈ సమస్య ఉన్నవారు భోజనాన్ని మానేయడం మంచిది కాదు. కొందరు ఉదయం లేదా రాత్రి భోజనం చేయడం మానేస్తుంటారు. ఇలా తరచూ చేస్తుంటే స్పృహ తప్పి పోవడం అనే సమస్య వస్తుంది. కాబట్టి భోజనాన్ని మానేయడం మంచిది కాదు. అలాగే అన్ని పోషకాలు కలిగిన ఆహారాలను తినాలి. షుగర్, హైబీపీ, థైరాయిడ్ ఉన్నవారు అయితే ఆయా సమస్యలు కంట్రోల్‌లో ఉన్నాయా, లేదా అని తరచూ పరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా మందులను వాడాలి. డైట్‌ను పాటించాలి. మరీ అతిగా వ్యాయామం లేదా శారీరక శ్రమ చేయకూడదు. ఇలా కొన్ని సూచనలు పాటిస్తే ఈ సమస్య నుంచి బయట పడవచ్చు.

# స్థూలకాయం సమస్యతో బాధపడుతున్నారా..?

హెల్త్ న్యూస్ ,02 ఏప్రిల్ (క్రాంతి న్యూస్ ): చాలా మంది అధిక బరువు, స్థూలకాయం ఒక్కటేనని అనుకుంటారు. కానీ అధిక బరువు వేరు. స్థూలకాయం వేరు. అధిక బరువు అనేది శరీరం ఉండాల్సిన బరువు కన్నా ఎక్కువ ఉండడాన్ని సూచిస్తుంది. అదే స్థూలకాయం అయితే ఒక వ్యాధి అని చెప్పవచ్చు. ఈ వ్యాధి వచ్చిన వారికి శరీరమంతటా కొవ్వు చేరుతుంది. దీంతో బరువు ఎక్కువగా ఉంటారు. అధిక బరువు ఉన్నవారికి సాధారణంగా పొట్ట లేదా తొడలు, పిరుదుల వద్ద మాత్రమే కొవ్వు ఉంటుంది. కానీ స్థూలకాయం ఉంటే శరీరం మొత్తం కొవ్వు అధికంగా ఉంటుంది. దీంతో ఆయా భాగాలను కదిలించేందుకు ఇబ్బందిగా అనిపిస్తుంది. అయితే అధిక బరువు, స్థూల కాయం రెండూ దాదాపుగా ఒక్కటే అయినప్పటికీ స్థూలకాయం బారిన పడ్డారంటే మాత్రం ఒక పట్టాన తగ్గదు. బరువును తగ్గించుకోవడం కోసం చాలా తీవ్రంగా శ్రమించాల్సి వస్తుంది.

కారణాలు ఇవే..

స్థూలకాయం వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించడం, శారీరక శ్రమ చేయకపోవడం, నిత్యం కంప్యూటర్ ఎదుట లేదా అధిక గంటల పాటు కూర్చుని పనిచేయడం, శరీరంలో ఎలాంటి కదలికలు లేకపోవడం, జన్యు సంబంధమైన సమస్యలు ఉండడం, వంశ పారంపర్యంగా స్థూల కాయం సమస్య ఉండడం, మెటబాలిజం దెబ్బ తినడం, వయస్సు మీద పడడం, నిద్రలేమి, తీవ్రమైన ఒత్తిడి, థైరాయిడ్ లేదా మహిళల్లో అయితే పీసీవోఎస్ సమస్యలు, డిప్రెషన్‌ను తగ్గించే మందులను ఎక్కువ రోజుల పాటు వాడడం, పర్యావరణ ప్రభావం.. వంటి అనేక కారణాల వల్ల చాలా మందికి స్థూలకాయం వస్తుంటుంది. స్థూలకాయం ఉన్నవారు ఎలాంటి మందులను వాడాల్సిన పనిలేదు. పలు జాగ్రత్తలను పాటిస్తే ఈ సమస్య నుంచి బయట పడవచ్చు.

ఆహారం ముఖ్యం..

స్థూలకాయం ఉన్నవారు పండ్లను, కూరగాయలను అధికంగా తింటుండాలి. క్యాలరీలు తక్కువగా, ఫైబర్ అధికంగా ఉండేలా చూసుకోవాలి. దీంతో కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆకలి నియంత్రణలో ఉంటుంది. ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. బ్రౌన్ రైస్, కినోవా, ఓట్స్, తృణ ధాన్యాలను అధికంగా తినాలి. వీటిల్లోనూ ఫైబర్ అధికంగానే ఉంటుంది. ఇది షుగర్ లెవల్స్‌ను పెరగకుండా చేస్తుంది. దీంతో ఆహారం మీద యావ తగ్గుతుంది. బరువు తగ్గేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. చికెన్ బ్రెస్ట్, చేపలు, బీన్స్, పప్పు దినుసులు, సోయా తోఫు వంటి ఆహారాల్లో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందించడమే కాదు, కండరాలు నిర్మాణం అయ్యేలా చేస్తాయి. దీంతో బరువు కూడా తగ్గుతారు. ముఖ్యంగా స్థూలకాయం తగ్గుతుంది.

వ్యాయామం కూడా అవసరమే..

క్యాలరీలు అధికంగా ఉండే ఆహారాలను, తీవ్రంగా ప్రాసెస్ చేయబడిన ఫుడ్స్‌ను, అనారోగ్యకరమైన కొవ్వులు, చక్కెరలు ఉండే



ఆహారాలు, సోడియం అధికంగా ఉండే ఆహారాలను స్థూలకాయం ఉన్నవారు తినరాదు. శీతల పానీయాలు, చక్కెర కలిగిన డ్రింక్స్, చాక్లెట్లు, స్వీట్లను కూడా ముట్టుకోకూడదు. స్నాక్స్ ఎట్టి పరిస్థితిలోనూ తినకూడదు. మీ శరీరానికి, మీరు చేసే పనికి ఎంత ఆహారం అవసరమో అంతే తినాలి. రాత్రి పూట అన్నం మానేసి కేవలం 2 పుల్కాలను తినాలి. గ్రీన్ టీ తాగాలి. రాత్రి పూట ఒక కివి పండును తినాలి. నీళ్లను అధికంగా తాగాలి. రోజూ ఉదయం దానిమ్మ పండ్ల రసాన్ని ఒక గ్లాస్ మోతాదులో తాగాలి. రోజూ కనీసం 30 నిమిషాల పాటు తేలికపాటి వ్యాయామం అయినా చేయాలి. ఆఫీసుల్లో పనిచేసే వారు ప్రతి 20 నిమిషాలకు ఒకసారి బ్రేక్ తీసుకోవాలి. ఇలా జీవనశైలిలో చిన్నపాటి మార్పులు చేసుకుంటే కచ్చితంగా స్థూలకాయం తగ్గుతుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ బారి నుంచి సురక్షితంగా ఉండవచ్చు.

# లాసోడా పండ్లు ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయో తెలుసా?


హెల్త్ న్యూస్ ,02 ఏప్రిల్ (క్రాంతి న్యూస్ ):లాసోడా లేదా గ్లూబెర్రీ అని కూడా పిలువబడే ఈ పండు అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి వుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుందని, రోగనిరోధక శక్తిని పెంచుతుందని వైద్య నిపుణులు చెబుతారు. ఆయుర్వేద వైద్యంలో దీనిని ఉపయోగిస్తుంటారు. లాసోడా పండ్లు ఆహారంలో భాగం చేసుకుంటే జీర్ణ ప్రక్రియలకు సహాయపడుతుందని చెబుతారు.లాసోడా కాయలు రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసే సామర్థ్యం వున్నవిగా చెప్పబడ్డాయి.లాసోడా సాంప్రదాయకంగా కాలేయ పనితీరు, నిర్విషీకరణకు మద్దతు ఇవ్వడానికి ఉపయోగించబడుతుంది.



# స్ట్రాబెర్రీలు ఎందుకు తినాలో తెలుసా?



హెల్త్ న్యూస్ ,02 ఏప్రిల్ (క్రాంతి న్యూస్ ):స్ట్రాబెర్రీలు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వీటిలో విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచేందుకు దోహదపడుతుంది. స్ట్రాబెర్రీలు తింటుంటే గుండె ఆరోగ్యంగా వుంటుంది. స్ట్రాబెర్రీలలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది కనుక ఇది రోగనిరోధక పనితీరుకు అవసరం. స్ట్రాబెర్రీలలో యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్, రక్తపోటును తగ్గించి గుండె ఆరోగ్యానికి మద్దతు ఇస్తాయి.స్ట్రాబెర్రీలలోని ఫైబర్ కంటెంట్ ఆరోగ్యకరమైన జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది, మలబద్ధకాన్ని నివారిస్తుంది.స్ట్రాబెర్రీలలో కేలరీలు తక్కువగా ఉంటాయి, ఫైబర్ అధికంగా ఉంటాయి, ఇది బరువు నిర్వహణకు సహాయపడుతుంది.స్ట్రాబెర్రీలు యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి, ఇవి ఫ్రీ రాడికల్స్ నుండి శరీరాన్ని దెబ్బతినకుండా రక్షించడంలో సహాయపడతాయి.పరిశోధనలు స్ట్రాబెర్రీలు రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడంలో సహాయపడతాయని సూచిస్తున్నాయి.



KR TV క్రాంతి
శనివారం 03-05-2025
క్రీడలు
epaper.krtvnews.com



## ఇంటర్నేషనల్ బ్రాండ్‌కు
## గ్లోబల్ అంబాసిడర్‌గా కేఎల్ రాహుల్



స్పోర్ట్స్ న్యూస్ ,02 ఏప్రిల్ (క్రాంతి న్యూస్ ):ప్రముఖ ఇంటర్నేషనల్ బ్రాండ్ పాల్ అండ్ షార్క్‌కు గ్లోబల్ అంబాసిడర్‌గా టీమిండియా స్టార్ క్రికెటర్ కేఎల్ రాహుల్ నియమితుడయ్యాడు. ఈ విషయాన్ని పాల్ అండ్ షార్క్ సంస్థ యాజమాన్యం ఇవాళ ప్రకటించింది. రాహుల్ లాంటి నిష్ణాతుడైన క్రికెటర్‌తో భాగస్వామ్యం పొందడం తమ సంస్థకు గర్వకారణమని పేర్కొంది. రాహుల్ పాల్ అండ్ షార్క్‌కు గ్లోబల్ అంబాసిడర్‌గా ఎంపికైన మొట్టమొదటి భారత అథ్లెట్.


పాల్ అండ్ షార్క్ అనేది ఇటలీకి చెందిన లగ్జరీ దుస్తుల కంపెనీ. ఈ సంస్థను పాలో డిని అనే వ్యాపారవేత్త 1975లో స్థాపించాడు. దీని ప్రధాన కార్యాలయం వారెస్‌లో ఉంది. ఈ ఫ్యాషన్ బ్రాండ్ ప్రధానంగా లైఫ్‌స్టైల్ మరియు స్పోర్ట్స్‌వేర్ దుస్తులను తయారు చేస్తుంది. ఈ కంపెనీ లోగోపై షార్క్ గుర్తు ఉంటుంది. ఈ కంపెనీకి ప్రపంచవ్యాప్తంగా 280 స్టోర్లు ఉన్నాయి. పాల్ అండ్ షార్క్ భారత్‌లో 15 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ కంపెనీకి భారత్‌లో ప్రముఖ నగరాల్లో స్టోర్లు ఉన్నాయి.

ఇదిలా ఉంటే, కేఎల్ రాహుల్ ప్రస్తుతం ఐపీఎల్ 2025తో బిజీగా ఉన్నాడు. ఈ సీజన్‌లో అతను ప్రాతినిథ్యం వహిస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ ప్లే ఆఫ్స్ బెర్త్‌కు ప్రధాన పోటీదారుగా ఉంటూ, పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో కొనసాగుతుంది. ఢిల్లీ ఇప్పటివరకు ఆడిన 10 మ్యాచ్‌ల్లో 6 విజయాలు సాధించింది.

ఈ జట్టు విజయాల్లో కేఎల్ రాహుల్‌ది కీలకపాత్ర. రాహుల్ ఈ సీజన్‌లో 9 మ్యాచ్‌లు ఆడి 53 సగటున, 146.06 స్ట్రయిక్‌రేట్‌తో 371 పరుగులు చేసి లీడింగ్ రన్‌స్కోరర్ల జాబితాలో తొమ్మిదో స్థానంలో ఉన్నాడు. ఢిల్లీ తమ తదుపరి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ మే 5న హైదరాబాద్‌లో జరుగనుంది.

## కోహ్లీని ఇంపాక్ట్ చేసిన ప్లేయర్ అతడేనట!

స్పోర్ట్స్ న్యూస్ ,02 ఏప్రిల్ (క్రాంతి న్యూస్ ): రాయల్ చాలెంజర్స్ బెంగళూరు యూట్యూబ్ చానెల్‌పై మయంతి లాంజర్‌తో జరిగిన పోడ్కాస్ట్‌లో, విరాట్ కోహ్లీ చెప్పారు, కెరీర్ ప్రారంభ దశలో తనతో ఆడిన ఆటగాళ్లలో మార్క్ బౌచర్ అతనిపై అతిపెద్ద ప్రభావాన్ని చూపించాడని. బౌచర్ అతని ఆటలో మెరుగుదలకు అవసరమైన బలహీనతలను గుర్తించి, అడగకుండా సలహా ఇచ్చేవాడని తెలిపాడు. కోహ్లీ మాట్లాడుతూ, "నేను అరంగేట్ర దశలో ఆడిన ఆటగాళ్లలో మార్క్ బౌచర్ నా మీద అత్యధిక ప్రభావం చూపించాడని పేర్కొన్నాడు. నేను అడగకుండానే అతడు తనను గైడ్ చేశాడని వెల్లడించాడు.



2020లో ఏబి డివిలియర్స్‌తో ఇన్‌స్టాగ్రామ్ లైవ్‌లో మాట్లాడినప్పుడు కూడా కోహ్లీ బౌచర్‌ను ప్రశంసించారు. అర్సీబీ నెట్‌లో టెన్నిస్ బంతిని, రాకెట్‌ను తీసుకుని బౌన్సర్లను, షార్ట్ బాల్స్‌ను ప్రాక్టీస్ చేయించారు. "మీరు అంతర్జాతీయ క్రికెట్ ఆడాలనుకుంటే, షార్ట్ బాల్ ఆడటం నేర్చుకోవాల్సిందే.. లేకపోతే పూర్తిగా ఇంగ్లాండ్ టూర్ గురించి మర్చిపో" అంటూ స్పష్టంగా సూచించాడని అతడి దూరదృష్టి తనకు ఎంతో ప్రేరణగా నిలిచిందని కోహ్లీ పేర్కొన్నాడు. అనంతరం క్రికెటర్‌గా ఎదిగిన విరాట్ కోహ్లీ, ప్రస్తుతం తన 18వ ఐపీఎల్ సీజన్‌లో 10 ఇన్నింగ్స్‌లో 443 పరుగులు చేసి, మళ్లీ ఆరెంజ్ క్యాప్ పోటీలో కొనసాగుతున్నారు. దీని ద్వారా ఆయనలో ఇంకా అత్యున్నత స్థాయిలో ప్రదర్శించాలనే ఉత్సాహం కొనసాగుతూనే ఉంది. మొత్తంగా ఐపీఎల్ లో విరాట్ కోహ్లీ లెక్కలేనన్ని రికార్డులు ఉన్నాయి. మనుముందు కూడా ఐపీఎల్ లో విరాట్ మరిన్ని రికార్డులు తన ఖాతాలో వేసుకోవడం ఖాయం.

ఇక ప్రస్తుత సీజన్ లో ఆర్సీబీ ప్లేఆఫ్స్ రేసులో ముందుంది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఈ సీజన్‌లో 10 మ్యాచ్‌లు ఆడి 14 పాయింట్లు సంపాదించి, నెట్ రన్‌రేట్ 0.521తో ప్లేఆఫ్స్ కోసం కీలక పోటీ విభాగంలో నిలిచింది. ఇంతకుముందు రన్‌రేట్ వల్ల వారు చరిత్రలోనే ప్రథమ స్థానంలో ఉండగా, ముంబయి ఇండియన్స్ మే 1న చేసిన ద్వితీయ దీర్ఘ విజయంతో అర్సీబీ ని టాప్ స్థానం నుంచి పక్కకు నెట్టింది. అర్సీబీ కు ఇంకా నాలుగు లీగ్ మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి – చెన్నై సూపర్ కింగ్స్ , లక్నో సూపర్ జైంట్స్ , సన్‌రైజర్స్ హైదరాబాదు కోల్‌కతా నైట్ రైడర్స్ . ప్లేఆఫ్స్‌లో ఖచ్చితంగానే చేరాలంటే మరో మ్యాచ్ గెలవాల్సింది. అయినా ఇతర ఫలితాలు అనుకూలంగా ఉంటే 14 పాయింట్లతో కూడా అవకాశం ఉంది. ఇప్పటికైయితే అర్సీబీ కి ప్లేఆఫ్స్ ప్రాబబిలిటీ అంచనగా 88%గా ఉంది.

## టీ20ల్లో కొత్త మైలురాయి..
## ట్రెంట్ బౌల్ట్ ఖాతాలో 300 వికెట్లు



స్పోర్ట్స్ న్యూస్ ,02 ఏప్రిల్ (క్రాంతి న్యూస్ ): ముంబై ఇండియన్స్ పేస్ బౌలర్ ట్రెంట్ బౌల్ట్ .. టీ20 క్రికెట్‌లో 300 వికెట్లు తీసిన ప్లేయర్‌గా నిలిచాడు. రాజస్థాన్ రాయల్స్‌తో జైపూర్‌లో జరిగిన మ్యాచ్‌లో ఆ మైలురాయిని దాటేశాడు. న్యూజిలాండ్‌కు చెందిన బౌల్ట్ కు.. టీ20ల్లో ప్రత్యేక బౌలర్‌గా గుర్తింపు ఉన్నది. పవర్‌ప్లేలో వికెట్ టేకింగ్ మెషీన్‌గా పేరున్నది. ఆర్ఆర్‌తో మ్యాచ్‌లో అతను 28 రన్స్ ఇచ్చి మూడు వికెట్లు తీశాడు.

ట్రెంట్ బౌల్ట్ ఇప్పటి వరకు 257 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. 25.10 సగటుతో అతను 302 వికెట్లు తీసుకున్నాడు. 300 వికెట్లు తీసిన న్యూజిలాండ్ బౌలర్లలో అతను మూడోవాడు. కివీస్ బౌలర్లు టిమ్ సౌథీ 343, ఇష్ సోధీ 310 వికెట్లు తీసుకున్నారు.

ప్రస్తుతం ఐపీఎల్‌లో బౌల్ట్ టాప్ ఫామ్‌లో ఉన్నాడు. గత 5 మ్యాచుల్లో అతను 11 వికెట్లు తీసుకున్నాడు. పర్పుల్ క్యాప్ రేసులో మూడవ స్థానంలో ఉన్నాడు. గురువారం జరిగిన మ్యాచ్‌లో ఆర్ఆర్ జట్టు 100 రన్స్ తేడాతో ఓటమి పాలైంది. ఇక ఐపీఎల్ పాయింట్ల పట్టికలో ముంబై జట్టు ఏడు విజయాలు, నాలుగు ఓటమిలతో టాప్‌లో ఉన్నది. ఆ జట్టుకు14 పాయింట్లు ఉన్నాయి. ఆర్ఆర్ ప్లేఆఫ్ రేసు నుంచి తప్పుకున్నది.

## సంజు శాంసన్ విషయంలో వ్యాఖ్యలు.. శ్రీశాంత్‌పై చర్యలు

స్పోర్ట్స్ న్యూస్ ,02 ఏప్రిల్ (క్రాంతి న్యూస్ ): టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్ పై కేరళ క్రికెట్ అసోసియేషన్ చర్యలు తీసుకుంది. అతడిపై మూడేళ్లపాటు సస్పెన్షన్ విధించింది. కేరళ క్రికెట్ లీగ్‌లోని కొల్లం ఏరీస్ ఫ్రాంచైజీకి శ్రీశాంత్ సహ యజమాని. విజయ్ హజారే ట్రోఫీలో కేరళ జట్టు నుంచి సంజు శాంసన్ ను తప్పించారని కేసీఏపై శ్రీశాంత్ ఆరోపణలు చేశాడు. ఏప్రిల్ 30న సమావేశమైన కేసీఏ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది.



ఓ మలయాళ టీవీ ఛానెల్‌లో జరిగిన చర్చ సందర్భంగా సంజు శాంసన్ ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక కాకపోవడానికి ఓ రకంగా కేసీఏ కారణమని శ్రీశాంత్ ఆరోపించాడు. విజయ్ హజారే ట్రోఫీలో పాల్గొన్న కేరళ జట్టులో సంజుకు చోటు కల్పించకపోవడంతోనే ఇలా జరిగిందని అతడు విశ్లేషించాడు. అయితే టీవీ చర్చల్లో సంజుకు, శ్రీశాంత్ మద్దతుగా నిలిచినందుకు నోటీసు ఇవ్వలేదని, కేసీఏ గౌరవ, ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా మాట్లాడినందుకే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని కేరళ క్రికెట్ అసోసియేషన్ వివరించింది. అలాగే.. సంజు ఎంపికకు సంబంధించి నిరాధారమైన ఆరోపణలు చేసినందుకు అతడి తండ్రి శాంసన్ విశ్వనాథ్‌తో సహా మరో ఇద్దరిపై నష్టపరిహారం దావా వేయాలని సమావేశంలో కేరళ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు నిర్ణయించారని సమాచారం.

గతంలోనూ శ్రీశాంత్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు సంబంధించి... కొల్లం ఏరీస్, అలప్పుళ టీమ్ లీడ్, అలప్పుళ రిప్పల్స్ ఫ్రాంచైజీలకు షో-కాజ్ నోటీసులు జారీ అయ్యాయి. అయితే.. వాటికి ఫ్రాంచైజీలు ఇచ్చిన సమాధానాలు సంతృప్తికరంగా ఉన్నందున, వాటి మీద ఏ విధమైన చర్యలు ఉండవని కేసీఏ తెలిపింది. కానీ జట్టు నిర్వహణకు సభ్యులను నియమించేటప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

## లార్డ్స్‌లో టీ20 వరల్డ్‌కప్ ఫైనల్

స్పోర్ట్స్ న్యూస్ ,02 ఏప్రిల్ (క్రాంతి న్యూస్ ): వచ్చే ఏడాది ఇంగ్లండ్‌లో జరగాల్సి ఉన్న మహిళల టీ20 ప్రపంచకప్ ఫైనల్‌కు ప్రఖ్యాత లార్డ్స్ మైదానం ఆతిథ్యమివ్వనున్నది. ఈ మేరకు ఐసీసీ గురువారం టీ20 ప్రపంచకప్–2026 షెడ్యూల్‌తో పాటు మ్యాచ్‌లు జరిగే వేదికలనూ ప్రకటించింది. జూన్ 12న మొదలయ్యే ప్రపంచకప్.. జూలై 5న లార్డ్స్‌లో జరుగబోయే ఫైనల్‌తో ముగుస్తుంది.

ICC WOMEN'S T20 WORLD CUP ENGLAND & WALES 2026

8
క్రాంతి
శనివారం 03-05-2025
సినిమా న్యూస్
epaper.krtvnews.com



కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ తన రిటైర్మెంట్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఎప్పుడైనా బలవంతంగా సినిమాను వీడాల్సి రావచ్చని అన్నారు. తాజాగా పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకున్న ఆయన ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ జీవితం ఎంతో విలువైనదన్నారు.

"నేను నటన నుంచి ఎప్పుడు వైదొలగుతానో ఎవరికీ తెలియదు. బలవంతంగానైనా సినిమాను వీడాల్సి రావొచ్చు. నేను ఏ విషయాన్ని తేలికగా తీసుకోకూడదనుకుంటున్నా. ప్రేక్షకులు నా నటన గురించి ఫిర్యాదు చేస్తారేమో తెలియదు కదా!. నన్ను వారంతా ఆదరిస్తున్నప్పుడే వైదొలుగుతానేమో. జీవితం చాలా విలువైనది. నేను ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాను. అలాగే నా స్నేహితులు, బంధువుల్లో చాలామంది జీవితంతో పోరాటాలు

# బలవంతంగా సినిమాను వీడాల్సి వస్తుందేమో - స్టార్ హీరో అజిత్

చేస్తున్నవారు ఉన్నారు. వారంతా క్యాన్సర్‌కు చికిత్స తీసుకుంటూ జీవిస్తున్నారు. అలాంటి వారిని చూసినప్పుడు జీవితం విలువ అర్థమవుతుంది. నేను నా లైఫ్‌లోని ప్రతి క్షణాన్ని ఆస్వాదించాలనుకుంటున్నా. జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలని భావిస్తున్నాను. సమయాన్ని వృథా చేయను" అని చెప్పారు.

తాను అనుకోకుండా ఇండస్ట్రీకి వచ్చినట్లు అజిత్ ఇటీవల తెలిపారు. "మనం ఒకటి అనుకుంటే విధి మనల్ని మరొకటి చేస్తుంది. నేను స్టార్‌గా ఎదగాలని ఇండస్ట్రీకి రాలేదు. నా అప్పులు తీర్చడానికి నటుడిని అయ్యాను. నా మొదటి సినిమా చూస్తే అందులో నా నటన భయంకరంగా ఉంటుంది. తమిళంలో కూడా నా సినిమాలకు మరొకరితో డబ్బింగ్ చెప్పించేవారు. నేను మాట్లాడే యాస బాగా లేదని ఎంతోమంది విమర్శించారు. ఇప్పటికీ కొందరు మిమిక్రీ చేసేటప్పుడు తొలినాళ్లలో నా మాటతీరును చేస్తారు. కానీ, నేను ఆ విమర్శలకు కుంగిపోలేదు. సవాలుగా తీసుకున్నాను. నిజాయతీగా పని చేశాను" అని అన్నారు.


# ఆసక్తి కలిగిస్తున్న 'బకాసుర రెస్టారెంట్' ఫస్ట్‌లుక్



ప్రముఖ కమెడియన్, నటుడు ప్రవీణ్ త్వరలోనే భకాసుర అనే రెస్టారెంట్‌ను ప్రారంభించబోతున్నారు.. అనే న్యూస్ అందరిలోనూ కాస్త ఆసక్తి కలిగించి వైరల్‌గా మారింది. అయితే ప్రవీణ్ నటుడిగా బిజీగానే ఉన్నాడు కదా.. మరీ వ్యాపారంలోకి ఎందుకు వెళ్లుతున్నాడు అనే సందేహం కూడా అందరిలో కలిగింది. అయితే ఎట్టకేలకు ఇప్పుడు ఈ న్యూస్‌పై ఓ క్లారిటీ వచ్చింది. ప్రవీణ్ ఎటువంటి రెస్టారెంట్‌ను పెట్టడం లేదు.. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం పేరు 'భకాసుర రెస్టారెంట్'. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం శుక్రవారం విడుదల చేసింది. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ప్రవీణ్ పెద్ద గరిటెతో వంట చేస్తుండటం.. ఆ పక్కనే ఇతర పాత్రలు ఆ పోస్టర్‌లో కనిపిస్తున్నాయి. ఆ పోస్టర్‌లోనే గమనిస్తే వైవా హర్ష, షైనింగ్ ఫణి మరో వైపు విచిత్రంగా సమ్‌థింగ్ స్పెషల్ పాత్రలుగా కనిపిస్తున్నారు. ఎన్నో విజయవంతమైన చిత్రాలతో మంచి నటుడిగా, కమెడియన్‌గా అందరికి సుపరిచితుడైన ప్రవీణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు.

కృష్ణభగవాన్ ,షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్,ఇతర ముఖ్య పాత్రలో యాక్ట్ చేస్తున్నారు. ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రాన్ని ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్థన్ ఆచారి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం విడుదలకు సిద్దమైంది.ప్రమోషనల్ భాగంగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ " హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. పూర్తి వినోదాత్మకంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నేటి యువతరంతో పాటు అన్ని వర్గాలు అలరించే అంశాలున్నాయి. ప్రతి సన్నివేశం అందరికి ఎంతో థ్రిల్‌ను పంచుతుంది. ప్రవీణ్ కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమాగా ఇది ఉండబోతుంది.

# తొలిరోజే వన్ మిలియన్ క్లబ్‌లోకి..



నాని హీరోగా శైలేశ్ కొలను దర్శకత్వంలో వచ్చిన యాక్షన్ థ్రిల్లర్ 'హిట్ 3'. మే 1న ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా విజయాన్ని సొంతం చేసుకుంది. తొలిరోజు ప్రపంచవ్యాప్తంగా రూ.43 కోట్లు వసూలు చేసినట్లు నిర్మాణసంస్థ తెలిపింది. . నాని కెరీర్‌లోనే తొలిరోజు అత్యధిక వసూళ్లు సాధించిన రెండో చిత్రంగా నిలిచింది. దేశవ్యాప్తంగానే కాకుండా ఓవర్సీస్‌లోనూ ఈ చిత్రం సత్తా చాటుతోంది. ప్రీ బుకింగ్స్‌లోనే హవా చూపించిన ఈ సినిమా విడుదల తర్వాత కూడా అదే జోష్ కొనసాగుతోంది. ఓవర్సీస్‌లో తొలిరోజే వన్ మిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరింది. ఈ వారాంతంలోనే రెండు మిలియన్ డాలర్లు వసూలు చేసే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. 'హిట్' ఫ్రాంఛైజీలో భాగంగా వచ్చిన చిత్రమే 'హిట్: ది థర్డ్ కేస్'. నాని అర్జున్ సర్కార్ పాత్రలో మరో యాంగిల్ చూపించారు. సాఫ్ట్‌గా కనిపిస్తూనే వైలెంట్‌గా నటించారు.

ప్రముఖ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ 'బుక్‌మై షో'లోనూ 'హిట్: ది థర్డ్ కేస్' రికార్డులు సృష్టిస్తోంది. 24 గంటల్లో 2.72లక్షల టికెట్లు అమ్ముడైనట్లు సంస్థ తెలిపింది. నాని కెరీర్‌లో ఒక్కరోజే ఇన్ని టికెట్స్ సేల్ కావడం ఇదే తొలిసారి అని పేర్కొంది.


# మైథలాజికల్ కథలో తమన్నా

"అడవి పిలిచింది... నేను సమాధానం చెప్పాను' అని అంటున్నారు మిల్కీ బ్యూటీ తమన్నా . సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా అరుణభ్ కుమార్, దీపక్ మిశ్రా దర్శకత్వంలో 'వి వన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' అనే మైథలాజికల్ సినిమా తెరకెక్కుతోంది. బాలాజీ మోషన్ పిక్చర్స్, ది వైరల్ ఫీవర్ మోషన్ పిక్చర్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఈ సినిమాలో తమన్నా కీలక పాత్ర పోషిస్తున్నట్లు నిర్మాణ సంస్థ వెల్లడిస్తూ, దానికి సంబంధించిన ప్రీ టీజర్‌ను విడుదల చేశారు.

రాత్రి వేళ ఎర్రటి చీర ధరించిన తమన్నా కారు దిగి అడవిలోకి వెళ్లి, అక్కడ ఓ దీపం వెలిగించడం, అక్కడ ఏదో దృశ్యాన్ని చూసి కళ్లు పెద్దవి చేయడం వంటి విజువల్స్ ఈ వీడియోలో కనిపించాయి. "అడవి పిలిచింది. నేను సమాధానం చెప్పాను. 'వ్వాన్'లో భాగం కావడం థ్రిల్లింగ్‌గా ఉంది" అంటూ సోషల్ మీడియిలో పేర్కొన్నారు తమన్నా. వచ్చే ఏడాది ఈ సినిమా విడుదల కానుంది.



# ప్రభాస్ అభిమానులు టెన్షన్ వద్దు..



కల్కి చిత్రం తర్వాత ప్రభాస్ నుండి ఎలాంటి సినిమా రాలేదు. డైరెక్టర్ మారుతి దర్శకత్వం వహిస్తున్న రాజాసాబ్ ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటుండగా, ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ప్రభాస్ లిస్ట్‌లో ఇప్పుడు చాలానే సినిమాలు ఉన్నాయి. డైరెక్టర్ హను రాఘవపూడి డైరెక్షన్?లో ఓ ప్రాజెక్ట్ చేస్తుండగా, ఈ ప్రాజెక్ట్ తర్వాత ప్రశాంత్ నీల్ డైరెక్షన్లో సలార్ 2, నాగ్ అశ్విన్ తో కల్కి 2 చేయనున్నాడు. మధ్యలో సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్‌లోను ప్రభాస్ ఓ చిత్రం చేయనున్నాడు. స్పిరిట్ అనే టైటిల్‌కి ఈ చిత్రానికి పెట్టారు.

సందీప్ రెడ్డి వంగా కొద్ది రోజుల క్రితం యానిమల్ సినిమాతో పాన్ ఇండియా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఇప్పుడు 'యానిమల్' మూవీకి సీక్వెల్‌గా 'యానిమల్ పార్క్' తెరకెక్కనుంది. అయితే, ఈ మూవీ తర్వాతే ప్రభాస్ 'స్పిరిట్' వస్తుందని.. దాని వలన స్పిరిట్ మరింత ఆలస్యం కానుందంటూ ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో మూవీ నిర్మాత భూషణ్.. ప్రభాస్ మూవీ షూటింగ్ త్వరలోనే మొదలు కానుందని తెలియజేశారు. 2, 3 నెలల్లోనే ఈ మూవీ షూటింగ్ ప్రారంభం అవుతుందని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. 2027లో రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. దీంతో ప్రభాస్ ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు.

సందీప్ రెడ్డి వంగా.. ప్రభాస్ తో కలిసి ఓ పవర్ పోలీస్ యాక్షన్ డ్రామాను రూపొందించనున్నారు. ఇందులో ప్రభాస్ పోలీస్ అవతారంలో చాలా పవర్ ఫుల్‌గా కనిపించనున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లాల్సి ఉంది. రాజాసాబ్ తర్వాత ప్రభాస్ స్పిరిట్ సినిమా కాకుండా ప్రశాంత్ వర్మతో చేయబోయే సినిమాలో జాయిన్ అవుతాడని జోరుగా ప్రచారాలు కూడా జరిగాయి. తాజాగా నిర్మాత క్లారిటీతో వీటన్నింటికి చెక్ పడ్డట్టు అయింది. 2027లో స్పిరిట్ సినిమా రిలీజ్ చేస్తామని నిర్మాత భూషన్ కుమార్ ప్రకటనతో ఫ్యాన్స్ మురిసిపోతున్నారు. ప్రస్తుతం ఇటలీలో ఉన్న ప్రభాస్ ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత రాజాసాబ్ మూవీ కంప్లీట్ చేసి ఆ తర్వాత స్పిరిట్ మొదలు పెట్టనున్నట్టు సమాచారం.

Printed, Published and owned by ---------------------, Printed at ---------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com